www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

**Published From :** Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
ఆదివారం 29, జూన్, 2025 | పేజీలు :12



- ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు
- ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15 నుంచే పథకం అమలు
- ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## మహిళలకు ఉచిత బస్సు పథకంపై కసరత్తు!

02



### ఉద్ధానంలో తీరనున్న నీటి కొరత!

02



### స్వేచ్ఛ సూసైడ్ వెనుక ?

03



### కాంగ్రెస్‌లో విభేదాలపై షర్మిల క్లారిటీ!

04






# బనకచర్ల ఎవరి కోసం?

## రాష్ట్రం కోసమా? మెగా కృష్ణారెడ్డి కోసమా?

- బనకచర్ల రాష్ట్రం కోసమా? కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి కోసమా?
- రాష్ట్రం కోసమని.. ఉపయోగకరమని చంద్రబాబు ప్రజంటేషన్
- కాదు కృష్ణారెడ్డి కోసమేనని కొందరు మేధావుల వాదన
- అంతే కాదు.. అక్కడ నుంచి నాయకులకు వచ్చే కమీషన్ల కోసమని కూడా
- మిగులు జలాల నుంచే ఎత్తిపోతలు కాబట్టి తెలంగాణ వాదన రాంగ్
- అయితే ఇద్దరికీ ప్రయోజనం అయ్యేలా చేస్తామంటున్న చంద్రబాబు
- మరి ఇంత ఖర్చు పెట్టి ఎత్తిపోతలు చేస్తే ..
- రాయలసీమకు అయితే నీళ్లు వస్తాయి.. నిజమే
- ప్రాజెక్టు ఖర్చు మాత్రం రు.82000 కోట్లు
- ఇందులో మెగా కృష్ణారెడ్డి మిగుల్చుకునేదెంత..? నాయకులకు అందేదెంత?
- ఎవరికెంత అందినా.. భరించే బలిపశువులు మాత్రం ప్రజలే
- యాక్చువల్ కాస్టింగ్ తో ప్రాజెక్టు చేపట్టినా
- ఏ నాయకుడూ కమీషన్లు తీసుకోకపోయినా..
- బనకచర్ల మంచి ప్రాజెక్టే.. నో డౌట్





**టీపీఎన్, అమరావతి :**

బ్రిటీష్ వాడు తన వ్యాపారం కోసం రైళ్లు వేశాడు. కాని మనకు అది ఉపయోగపడింది. ఇందిరాగాంధీ ఒకందుకు బ్యాంకులు జాతీయకరణ చేసింది.. అది మనకు, దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడింది. అలాగే ప్రతి ఆలోచన వెనక ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి. ప్రతి ప్రాజెక్టు వెనక కూడా అంతే. బనకచర్ల.. ఇప్పుడు ఏపీ, తెలంగాణల మధ్య చాలా ఏళ్లు తర్వాత వివాదాన్ని రేపింది. వాస్తవానికి బనకచర్ల సముద్రంలో కలిసిపోయే మిగులు జలాల వినియోగానికి చేపట్టిన ప్రాజెక్టు. దీనిని వివాదాస్పదం చేయాల్సిన అవసరం తెలంగాణకు లేదు.. కేవలం రాజకీయం కోసం తప్ప. అప్పట్లో పట్టిసీమ కూడా అంతే. పోలవరం లేటు అవుతుంది కాబట్టి.. అప్పటికే కాలువలు తవ్వేశారు కాబట్టి.. పట్టిసీమ ఎత్తపోతలతో నీళ్లు కృష్ణాడెల్టాకు అందించారు. శ్రీశైలం నుంచి నీళ్లు రాయలసీమకు ఎక్కువ ఇచ్చే వీలు కూడా వచ్చింది. కాని అప్పుడు వైసీపీ అధినేత జగన్ పట్టిసీమ ప్రాజెక్టులో అవినీతి ఉందని ఆరోపించారు. ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి. విచిత్రంగా అదే మెగా కాంట్రాక్టర్ కోసం పోలవరం రివర్స్ టెండర్ వేయించి మరీ జగన్ అప్పచెప్పాడు. అప్పుడు టీడీపీ కూడా ఆరోపణలు చేసింది. తెలంగాణలో ప్రాజెక్టులు కట్టేది ఇదే మెగా కాంట్రాక్టర్. వైఎస్ రాజశేఖర్ రెడ్డి టైమ్‌లో వెలుగులోకి వచ్చిన ఈ మెగా కాంట్రాక్టర్ కేవీపీ పుణ్యమా అని దేశవ్యాప్తంగా పైప్ లైన్ల వర్కులు సంపాదించి హైట్స్‌కి వెళ్లిపోయాడని అంటారు. అది పెద్ద కంపెనీ అయిపోయింది. ఆ తర్వాత ఇక ఏపీ, తెలంగాణల్లో ఏ ప్రాజెక్టు అయినా సరే కాంట్రాక్ట మనోడిదే. అలా అయిపోయింది పరిస్థితి.

ఇప్పుడు ఈ బనకచర్ల ద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వొచ్చనేది చంద్రబాబు చెప్పేది. సముద్రంలో కలిసే మిగులుజలాలను వెనక్కి ప్రకాశం బ్యారేజీకి తెచ్చి అక్కడి నుంచి బనకచర్లకు తీసుకెళ్లి.. రాయలసీమకు అందివ్వడమే ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కాస్ట్ 82 వేల కోట్లు. ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య నడుస్తున్న వివాదం పక్కన పెడితే.. ఇప్పుడు కొందరు మేధావులు కొత్త చర్చ లేపారు. వారి వాదన ప్రకారం బనకచర్ల ఇప్పుడు అవసరం లేదు.. ఇది కేవలం కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి కోసమే.. అతడికి కాంట్రాక్టు లాభం.. అతడిచ్చే కిక్ బ్యాకులతో పాలకులకు లాభం.. ఇది వారి ఆరోపణ. చాలామంది మనసులో కూడా ఇదే ఉంది. కాని ఇది రాష్ట్రానికి ఉపయోగపడుతుంది కదా అని నోరు మిగతా 2వ పేజీలో..

## సీసీ కెమెరాల ఏర్పాటుతో క్రైమ్ తగ్గింది

- విజయవాడలో 'సురక్షా 360' కార్యక్రమం ప్రారంభం
- సీసీ కెమెరాల ఏర్పాటుతో రాష్ట్రంలో నేరాలు తగ్గాయన్న హోంమంత్రి
- ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



**విజయవాడ:**

రాష్ట్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గిందన్నారు హోంమంత్రి వంగలపూడి అనిత. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో సురక్షా 360 కార్యక్రమం హోంమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాంకేతికత వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందంజలో ఉందని ప్రశంసించారు హోంమంత్రి. మోడల్ పోలీసు స్టేషన్లు జిల్లా మొత్తం విస్తరించాలని.. సురక్ష యాప్, సురక్ష డివైస్‌ల వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. అలాగే ఈమధ్య కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరగియాన్నారు హోంమంత్రి. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు అనిత. క్షణికావేశంలో వాటిని క్లిక్ చేస్తే మీ కష్టార్జితం మొత్తం సైబర్ నేరగాళ్ల పాలవుతుందని ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. సాంకేతికతను మంచి కోసం ఎంతగా వాడుతున్నామో, చెడుకు కూడా అంతే స్థాయిలో వినియోగిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మోసాలను కూడా అరికట్టేందుకు టెక్నాలజీ ద్వారా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.

**మహిళల రక్షణకు పెద్దపీట**

మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నేడు శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా ఇస్తున్నామని చెప్పారు. మొబైల్ మన చేతిలో ఉంటే.. ప్రపంచం మొత్తం మన చేతిలోనే ఉంటుందని సీఎం చంద్రబాబు చెబుతారని గుర్తుచేశారు. అదే మొబైల్‌ను మనకు రక్షణగా, అస్త్రంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న వారు వాట్సాప్ నెంబర్‌కు ఒక్క మెసేజ్ చేస్తే పోలీసులు వెంటనే అప్రమత్తం అవుతారని హోంమంత్రి అనిత చెప్పుకొచ్చారు. ప్రజల భద్రత కోసం ఏపీ పోలీస్‌శాఖ, తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. స్మార్ట్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో వీఐపీ, వీవీఐపీలు ఎక్కువగా ఉంటే భద్రత మిగతా 2వ పేజీలో..





## ప్రతిపక్ష బంధువులకు అందలం!

### కూటమి ప్రభుత్వంలోనూ అర్హులకు అన్యాయం

- ద్వారంపూడి బంధువుకు హెల్త్ డైరెక్టర్ పదవి
- పవర్‌లో ఉన్నప్పుడు పవన్‌పై నోరు పారేసుకున్న ద్వారంపూడి
- ద్వారంపూడి బంధువుకు అండగా జనసేన మంత్రి
- గతంలో రాజమండ్రి రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న పద్మా శశిధర్
- రీజనల్ డైరెక్టర్‌గా బదిలీల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు
- పద్మా శశిధర్‌కు పదవి కట్టబెట్టడంపై వైద్య వర్గాల్లోనే ఆశ్చర్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య ప్రజలతోపాటు అధికారులకు కూడా న్యాయం జరుగుతుందని అంతా భావించారు. కానీ.. ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ప్రతిపక్షంలో ఉన్న నేతలకు అనుకూలంగా మారుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రభుత్వం అర్హులైన వారికే ఉన్నత పదవులు కట్టబెడుతుందని ప్రభుత్వ యంత్రాంగం అంతా ఆశపడింది. కానీ.. గత ప్రభుత్వ వైఖరినే ఇప్పటి మిగతా 2వ పేజీలో..



## ఉద్దానంలో తీరనున్న నీటి కొరత.. పలు ప్రాజెక్టులకు కేంద్రమంత్రి శంకుస్థాపన

**టీపీఎన్, శ్రీకాకుళం:**

జిల్లాలో పర్యటించారు కేంద్ర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు. శనివారం పాతపట్నం మండలం కాగువాడ గ్రామంలో రూ.265 కోట్లు నిధులతో నిర్మిస్తున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఉద్దానం ప్రాజెక్టు రెండో దశకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. పాతపట్నం నియోజకవర్గంలో ఉన్న వంశధార నది నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు తాగు, సాగు నీటిని అందించడం జరుగుతుందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో తాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు రామ్మోహన్‌నాయుడు. కూటమి ఏడాది పాలనలో జిల్లాలో రూ.600 కోట్లు నిధులు ఖర్చు చేసి గ్రామాల్లో రహదారులు ఇతర ప్రాజెక్టులను నిర్మించడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన తల్లికి వందనం, ఉచిత వంట గ్యాస్ వంటి పథకాలు సక్సెస్‌ఫుల్‌గా అమలు చేశామన్నారు. అలాగే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆహ్వానిస్తున్నామని చెప్పారు. సీబీఎన్ బ్రాండ్‌తో పెట్టుబడులు క్యూ కడుతున్నాయని చెప్పారు. ఇప్పటికే పలు కంపెనీలు పనులు స్టార్ట్ చేసాయని.. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తోందని చెప్పారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఆగష్టు 15నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పిస్తామన్నారు. త్వరలో మెలియాపుట్టి మండలంలో ఐటీడీఏ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో నిర్మిస్తున్న తాగునీటి పథకం శ్రీకాకుళం జిల్లాలో ఐదు మండలాలకు మన్యం జిల్లాలో రెండు మండలాల్లోని 578 గ్రామాలకు తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మాడి గోవిందరావు మాట్లాడుతూ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల త్వరలో మంజూరు జరిగేలా చూడాలని కేంద్రమంత్రిని కోరారు. గిరిజన గ్రామాల్లో వేసిన రహదారుల వలన స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీసీ కెమెరాల ఏర్పాటుతో క్రైమ్ తగ్గింది

**మొదటిపేజీ తరువాయి**

చాలా అవసరమని తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరిగిన అడ్డుకట్ట వేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

**టెక్నాలజీతోనే నేరాలకు అడ్డుకట్ట**

సైబర్ నేరాలతో పాటు, భౌతిక నేరాలను కూడా సాంకేతిక పరిజ్ఞానంతోనే అరికట్టగలమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఎక్కడ నేరం జరిగినా, ట్రాఫిక్ స్తంభించినా, అసాంఘిక శక్తుల అడ్డాలను టెక్నాలజీ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటున్నారని అనిత తెలిపారు. అస్త్రం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. నేడు పోలీసింగ్ అనేది ప్రజలకు చాలా చేరువ అవుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి వీధి, ప్రతి గ్రామాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అలాగే జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 28 'సురక్షా డివైస్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా ప్రార్థనా మందిరాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజం సాధ్యమన్నారు. సురక్షా 360 కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.





## బనకచర్ల ఎవరి కోసం?
### రాష్ట్రం కోసమా? మెగా కృష్ణారెడ్డి కోసమా?

**మొదటిపేజీ తరువాయి**

విప్పడం లేదు అంతే అంటున్నారు.
అసలు ఇది గతంలో జగన్, కేసీఆర్ ఉన్నప్పుడే ప్లాన్ చేశారంటున్నారు. అయితే అప్పుడు సాధ్యం కాలేదు. కాని ఇప్పుడు ఎన్డీయేలో కీలకంగా ఉన్న చంద్రబాబు వల్ల సాధ్యమవుతుంది అంటున్నారు. అప్పట్లో ఒకే ప్రాజెక్టుతో రెండు రాష్ట్రాలకు ప్రయోజనం అంటే చాలామందికి అర్థం కాలేదు.. అది ఎలా సాధ్యం అనుకున్నారు. భారీ నీటిపారుదల ప్రాజెక్టులన్నీ మోటార్లు పెట్టి తోడేసే ఎత్తిపోతలుగా మారిన దగ్గర నుంచి ప్యాట్రన్ మారిపోయింది. ఎక్కడ నుంచి ఎక్కడికైనా నీళ్లు ఎత్తుకుపోవచ్చు. కాని ఖర్చు ఎక్కువ. అయితే ఏముంది.. కాళేశ్వరం చూశాం కదా.. నీళ్లు వస్తాయి.. కాని చాలా డబ్బులు పెట్టాలి.. అందులో కాంట్రాక్టర్‌కు.. రాజకీయనాయకులకు వాటాలు.. వాళ్లు బాగుపడిపోతారు. కాని ప్రాజెక్టుకు పెట్టే డబ్బు ఎవరిది..? ప్రజలది.. దాని కోసం అప్పులు చేస్తే కట్టాల్సింది ఎవరు.. ప్రజలే. భారం పడేది ఎవరి మీద.. ప్రజల మీదే. ఇదే వాదన మేధావులది. సో.. ఇక్కడ బనకచర్లతో రాష్ట్రానికి మంచిదే.. మరో వైపు కాంట్రాక్టర్‌కు బెనిఫిట్.. అతని ద్వారా రాజకీయ నాయకులకు బెనిఫిట్ ఇవన్నీ భరించే బలిపశువులు ప్రజలు. అంటే బనకచర్ల అటు రాష్ట్రం కోసం.. ఇటు కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి కోసమునూ. రెండూ కరెక్టే. కానీ ఆ ప్రాజెక్టును నిజాయితీగా అసలైన కాస్ట్‌తో కట్టిస్తే.. బడ్జెట్ కరెక్టుగా వేసి.. కాంట్రాక్టర్ నిజాయితీగానే లాభం మినిమమ్ తీసుకుంటే.. ఏ రాజకీయ నాయకుడు కమీషన్ తీసుకోకపోతే... బనకచర్ల చాలా మంచి ప్రాజెక్ట్.. ఎనీ డౌట్.

# మహిళలకు ఉచిత బస్సు పథకంపై కసరత్తు!

- **ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు**
- **ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15 నుంచే పథకం అమలు**
- **ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే**
- **అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**టీపీఎన్, అమరావతి :**




ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకంలోని మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలని సీఎం సూచించారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశ పెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే ఉండాలని, ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

**ఆర్థిక కష్టాలున్నా హామీలు నిలబెట్టుకోవాలి**

రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా...ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని... అదే సమయంలో ప్రజాధనం సద్వినియోగం కావాలని, ప్రతీ రూపాయి విలువైనదేనని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**వివిధ మోడళ్ల పరిశీలనకు సీఎం ఆదేశం**

"బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి.
ఆర్టీసీనే పవర్ జనరేట్ చేసి.... ఈవీ బస్సులు వినియోగించగలిగితే ఎంతమేర మెయింటెనెన్స్ కాస్ట్ తగ్గుతుందనేది అంచనా వేయండి. పూర్తి స్థాయిలో కసరత్తు జరగాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అదనంగా 2,045 బస్సులు అవసరం**

కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందిని సీఎంకు అధికారులు వివరించారు.

**ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణిస్తారని అంచనా**

రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది. అయితే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు. మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది.

**అన్ని రాష్ట్రాలకన్నా ఉత్తమంగా అమలు**

ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**57 శాతం పల్లె వెలుగు, సిటీ బస్సు సర్వీసులే..**

మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 17 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోంది.

# ప్రతిపక్ష బంధువులకు అందలం!

**మొదటిపేజీ తరువాయి**

సర్కార్‌కు కూడా ఫాలో అవుతుండడంతో.. అర్హులైన అధికారులకు అన్యాయం జరుగుతోంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోనే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.
వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి బంధువైన డాక్టర్ పద్మా శశిధర్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పదవిని ప్రభుత్వం కట్టబెట్టింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు అనుకూలమైన వారిని కీలక పదవుల్లో నియమించుకున్నారు. దీని కారణంగా, కూటమి ప్రభుత్వం ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో ఆ అధికారులకే ముఖ్యమైన పదవులు ఇవ్వాల్సి వస్తోందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాజమండ్రిలో రీజినల్ డైరెక్టర్‌గా ఉన్న పద్మ శశిధర్, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి బాగా దగ్గర బంధువు. వైసీపీ హయాంలో ఆమెను రాజమండ్రిలో రీజినల్ డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆమెను ఏకంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పోస్టులో కూర్చోబెట్టింది. ఈ విషయంలో ఒక మంత్రి ద్వారా పావులు కదిపినట్లు వైద్య వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. వైసీపీ అధికారంలో లేకపోయినా, వారి ప్రభావం కొనసాగేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారని రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ సీఎం పవన్‌ని ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తీవ్రమైన అసభ్య పదజాలంతో ధూషించారు. ఐతే.. ఇప్పుడు అదే ద్వారంపూడి బంధువైన పద్మా శశిధర్‌కు జనసేన పార్టీకే చెందిన ఒక మంత్రి అండగా నిలబడటం ఆపార్టీతోపాటు మిగతా రాజకీయ వర్గాలనే ఆశ్చర్యానికి గురిచేస్తోంది.
ఇక కొత్తగా డైరెక్టర్ పోస్టులో నియమితులైన



డాక్టర్ పద్మా శశిధర్.. గతంలో రాజమండ్రిలో రీజనల్ డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు అనేక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ నేతల సిఫార్సుల మేరకు అనర్హులకు పోస్టింగ్స్ ఇవ్వడంతోపాటు ట్రాన్స్‌ఫర్స్‌లోనూ అక్రమాలు చేశారనే టాక్ వినిపిస్తోంది.

**బదిలీల్లో అవకతవకలు**

ఇటీవల జరిగిన బదిలీల్లో తెలుగుదేశం పార్టీకి సానుభూతిపరులైన అధికారులను, వారి సిఫార్సులు ఉన్నప్పటికీ, బలవంతంగా సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. MPHS(M)&MPHS(F)కౌన్సిలింగ్‌లో తప్పులు జరిగాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. బదిలీ ప్రక్రియ పూర్తయిన తర్వాత, పాత తేదీలతో ఆర్డర్స్ జారీ చేస్తున్నారని.. కొందరికి మోడిఫికేషన్ చేసిన ఆర్డర్స్ ఇస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రక్రియలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారుతోందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కౌన్సిలింగ్‌లో అక్రమాలు**

ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో, రీజనల్ డైరెక్టర్ ఆఫీసుకు కావలసిన వారిని తీసుకొచ్చేందుకు ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లు ప్రయత్నించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జీవో నంబర్ 344 ప్రకారం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో 3 సం



వత్సరాలకు పైగా పనిచేసిన వారిని అదే జిల్లాలో వేరే ఆఫీసుకు బదిలీ చేయాలి. కానీ.. రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న పద్మా శశిధర్ ఏకంగా జిల్లానే మార్చి.. వాళ్లకి వేరే జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులైన వారిని రీజనల్ డైరెక్టర్ ఆఫీసులో నియమించకుండా.. అనర్హులైన ఇద్దరికి అవకాశం ఇవ్వడంలో అంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక జీవో నంబర్ 23లోని ఎగ్జంప్షన్‌లను ఉద్యోగులకు ఇవ్వకుండా, ఏకపక్షంగా కౌన్సిలింగ్ నిర్వహించారనే వాదనలు కూడా తెరపైకి వస్తున్నాయి. దీంతో కొందరు ఉద్యోగులు రీజనల్ డైరెక్టర్ ఉత్తర్వులపై కోర్టును కూడా ఆశ్రయించారట. ఐతే.. కోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా పాత తేదీలతో ఉత్తర్వులు జారీ చేసి, కోర్టును కూడా తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 33 సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్న వారిని యూనియన్ నాయకులుగా పరిగణించి, అక్కడే కొనసాగించేలా చేసిన ఘనత కూడా ఈ మాజీ రీజనల్ డైరెక్టర్‌దే అన్న టాక్ వినిపిస్తోంది. మొత్తానికి అర్హులైన అడిషనల్ డైరెక్టర్‌లు ఉన్నప్పటికీ, వారందరినీ పక్కనపెట్టి డాక్టర్ పద్మా శశిధర్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పదవి కట్టబెట్టడం వైద్య వర్గాలనే ఆశ్చర్యపరుస్తోంది.

## విత్తనాలు, ఎరువులతో సంసిద్ధంగా ఉండండి..!

**టీపీఎన్, శ్రీకాకుళం :**

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎటుంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అయన మాట్లాదారు. ప్రధానంగా రైతులు ఖరీఫ్ సాగుకోసం అవసరమైన విత్తనాలు సాకాలంలో అందించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు బారులు తీరకుండా నిరంతరాయంగా వారికి అవసరమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో పాటు, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే ఎరువులు, విత్తనాలు అందించడానికి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో దూర ప్రాంతాలు వెళ్లి ఎరువుల తీసుకోవడం రైతులకు కష్టంగా అందువల్ల రైతులకు అనువైన ప్రదేశాల్లో రైతు సేవా కేంద్రాలు, పీఎసీఎస్‌ల ద్వారా ఎరువులు అందించాలని సూచించారు. సాగుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును అందించడం జరుగుతుందని అన్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద అర్హత ఉన్న వారికి అన్నదాత సుఖీభవ అందించ నున్నామని తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు హరివ ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారలు జగన్మోహన్ రావు, గోవిందరావు, అప్పారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో సమ్మె విరమించిన ఉద్యోగులు

- **విశాఖ మేయర్‌తో కార్మిక సంఘాల చర్చలు సఫలం.. విధుల్లోకి ఉద్యోగులు**
- **కార్మికుల సమ్మెతో రెండు రోజులు విశాఖలో నీటి కటకట**
- **ప్రజలతో పాటు పరిశ్రమల ఇబ్బందులు**

**విశాఖ:**



జీవీఎంసీ వాటర్ సప్లై ఉద్యోగుల సమస్య ఒక కొలిక్కి వచ్చింది. విశాఖలో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కార్మిక సంఘాల నేతలు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు శనివారం మధ్యాహ్నం సమ్మెను విరమించారు. రూ. 3 వేల నుంచి రూ. 6 వేల వరకు వేతనాలు పెంచేందుకు హామీ ఇవ్వడంతో సిబ్బంది సమ్మెను విరమించారు. తిరిగి విధులకు హాజరయ్యేందుకు అంగీకరించారు. కార్మికులకు పెంచిన జీతాలు, బకాయిలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. బకాయిలు చెల్లించేందుకు ఉత్తర్వులు ఇస్తామని మేయర్ చెప్పినట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు.
ఆప్కాస్ కార్మికుల జీతాలు పెంచకపోవడంతో రెండు రోజులుగా ధర్నా చేశారు. జీవీఎంసీ పరిధిలోని 98 వార్డులతో పాటు పరిశ్రమలకు తాగునీరు పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆసుపత్రులు సహా పలు కీలక పరిశ్రమలకు మంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఉదయం ఐదు గంటల నుంచి కులాయిలు రావాల్సి ఉన్నప్పటికీ నీటి సరఫరాకు బ్రేక్ పడడంతో పలు కాలనీల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. హెచ్‌పీసీఎల్, కోరమండల్, ఎస్సార్, ఆర్‌సీఎల్, పోర్ట్ మొదలగు పరిశ్రమలకు కూడా నీటి సరఫరా ఆగిపోయింది. దాదాపు 30 గంటలుగా పంపింగ్ ప్రక్రియ స్థంభించిపోయింది. ఏలేరు, తాటిపూడి, గోస్తని, గంభీరం, రైవాడ కెనాల్స్ నుంచి వచ్చే నీటిని ఉద్యోగులు నిలిపివేశారు. కొన్ని ప్రాంతాల్లో పర్మినెంట్ ఉద్యోగులతో కొంతమేర నీటి సరఫరా జరపడంతో, అది అరకొరగానే ఉంది. అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు, ఆందోళనకు దిగారు మహిళలు. దీంతో మేయర్ యాక్షన్‌లోకి దిగారు. కార్మికులతో చర్చలు జరిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు కార్మిక సంఘాలు కలిసొచ్చాయి. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపడతామని మేయర్ హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. కార్మికుల సమ్మె విరమణ తర్వాత బోనీ వాటర్ వర్క్స్ నుంచి విశాఖ నగరానికి మంచినీటి సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు.
జీవీఎంసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల్లో పదేళ్లు అనుభవం ఉండి, టెక్నికల్ విధులు నిర్వహిస్తున్న సుమారు 900 మందిని సెమీ స్కిల్ కేటగిరీలో చేర్చి, ఆ మేరకు వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. గతేడాది డిసెంబర్‌లో జీవీఎంసీ కౌన్సిల్ వేతనాల పెంపునకు ఆమోదం తెలపగా, అధికారులు మే నెల నుంచి నెలకు రూ.6 వేలు పెంచుతూ ఆప్కాస్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అయితే ఆచరణలో పాత వేతనాలే చెల్లించడంతో పాటు, జూన్ నెల జీతాలు కూడా పాత పద్ధతిలోనే అప్‌లోడ్ చేయడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతన పెంపు అమలు చేయాలంటూ కార్మికులు సమ్మె బాట పట్టారు.



# 18 ఏళ్లుగా న్యాయం కోసం నిరీక్షణ!

- అయేషా కేసులో ఇంతవరకు తేలని నిందితులు
- నిందితులెవరో తేల్చలేకపోయిన సీబీఐ
- మరోసారి కోర్టు మెట్లెక్కనున్న అయేషా పేరెంట్స్

**టీపీఎన్, అమరావతి :**

బిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు 18 ఏళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అయినా నేటి వరకు తమ బిడ్డను చంపిన వారెవరూ పోలీసులే కాదు.. చివరికి సీబీఐ కూడా గుర్తించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. తాజాగా ఎనిమిదేళ్లు విచారణ చేసి హైకోర్టులో నివేదిక ఇచ్చిన సీబీఐ.. ఆ కాపీలను మాత్రం అయేషా తల్లిదండ్రులకు ఇవ్వడం కుదరదని చెప్పడం ఇప్పుడు మరో వివాదానికి దారి తీసింది. దీంతో అసలు సీబీఐ విచారణలో ఏం తేలిందో.. తెలుసుకోవాలంటూ మరోసారి న్యాయపోరాటానికి అయేషా తల్లిదండ్రులు సిద్ధమయ్యారు.

విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద ఓ హాస్టల్‌లో 17 ఏళ్ల అయేషా మీరా అనే ఫార్మసీ విద్యార్థినిపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన 2007 డిసెంబర్ 27వ తేదీన జరిగింది. తాను ఉంటున్న హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో కత్తిపోట్లతో ఆయేషా మీరా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనంగా మారింది. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈకేసులో 2008లో పిడతల సత్యంబాబు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. 2010లో విజయవాడ మహిళా కోర్టు అత్యాచారం, హత్య ఆరోపణలతో అతనికి 10 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. 2010 అక్టోబర్‌లో కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సత్యంబాబు హైకోర్టులో అప్పీల్ చేయగా.. 2017లో సత్యంబాబును హైకోర్టు నిర్దోషిగా ప్రకటించి, పోలీసు దర్యాప్తులో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయేషా తల్లి శంషాద్ బేగం, తండ్రి ఇక్బాల్ బాషా న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించడంతో 2018లో హైకోర్టు ఈ కేసును రీ ఓపెన్ చేసి సీబీఐకి అప్పగించింది. దాదాపు ఎనిమిదేళ్ల విచారణ అనంతరం సీబీఐ తన తుది నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించింది. అయితే ఆ నివేదికలోని అంశాలు తమకు తెలియపరచాలని, కాపీలు ఇవ్వాలంటూ అయేషా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయల్సిందిగా సీబీఐని ఆదేశించడంతో.. వారు తమ విచారణ చేసిన నివేదికను తాను ఇవ్వాల్సిన అవసరం లేదని కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. తమ బిడ్డ చనిపోయి 18 యేళ్లు అయినా.. ఇప్పటి వరకు న్యాయం జరగలేదని, ఇప్పుడు సీబీఐ నివేదిక ఇవ్వడానికి కూడా ఆంక్షలు పెట్టడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మతాచారం ప్రకారం కూడా తమ బిడ్డ సంబంధించిన కొన్ని భాగాలు తమకు ఇప్పించాలని వారు కోరుతున్నారు. సీబీఐ తుది నివేదిక ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని, 18 ఏళ్లుగా తాము పోరాటం చేస్తుంటే సీబీఐ కోర్టుకు వెళ్లి రిపోర్ట్ తెచ్చుకోవాలని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంప్రదాయాలకు విరుద్ధంగా తమ కుమార్తె శరీరా అవశేషాలు విచారణ పేరుతో తీసుకొని వెళ్లారని, మత సాంప్రదాయాల ప్రకారం విరుద్ధమైన కూడా తాము సమ్మతిస్తే ఇప్పటి వరకు వెనక్కు ఇవ్వలేదని చెప్పారు. ఆర్థికంగా ,మానసికంగా తాము క్షోభ అనుభవిస్తున్నా సీబీఐ పట్టనట్లు వ్యవహరిస్తుందని, సీబీఐ అమ్ముడు పోయిందేమోనన్న అనుమానం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా సీఎం చంద్రబాబు సహాయం చేయాలని కోరుతున్నామని, ఈ ప్రభుత్వం స్పందించి తమ పాపను చంపిన నిజమైన హంతకులను శిక్షించాలని వారు కోరుతున్నారు. అయేషా మీరా హత్యను విచారణ చేసిన సీబీఐ దర్యాప్తు నివేదికను ఇవ్వాలని హైకోర్టులో అయేషా మీరా తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారని, సీబీఐ దాఖలు చేసిన కౌంటర్‌లో నివేదిక ఇవ్వనక్కర్లేదని చెప్పారని న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ తెలిపారు. సీబీఐ దర్యాప్తులో విఫలైందనే అనుమానం తమకు కలుగుతోందని, దీనిపై విచారణ జులై నాలుగో తేదీకి హైకోర్టు వాయిదా వేసిందని చెప్పారు.

అయేషా మీరా హత్య జరిగి 18 యేళ్లు అయినా నేటికీ దోషులెవరో తేలలేదు. పోలీసుల విచారణలో వైఫల్యాలతో.. కేసు సీబీఐకి ఇప్పగిస్తే.. ఐదేళ్లలో పూర్తి చేయాల్సిన విచారణకు ఎనిమిదేళ్లు తీసుకున్నారు. ఇప్పుడు హైకోర్టులో ఇచ్చిన నివేదిక కాపీని కూడా అయేషా తల్లిదండ్రులకు ఇవ్వడానికి అనేక రూల్స్ చెబుతున్నారు. దీంతో వారు ఇప్పుడు సీబీఐ నివేదికపైనా పలు సందేహాలు వ్యక్తం చేస్తూ.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, తమ నివేదికతోపాటు, తమ పాపకు సంబంధించిన వస్తువులను సీబీఐ నుంచి ఇప్పించాలంటూ కోర్టుకు విన్నవిస్తూ.. మరోసారి న్యాయ పోరాటానికి సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది

# స్వేచ్ఛ సూసైడ్ వెనుక?

- న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఉరేసుకొని సూసైడ్
- సహజీవనం చేస్తున్న పూర్ణచంద్రరావుపై తండ్రి తీవ్ర ఆరోపణలు
- పోస్టుమార్టంలో సంచలన విషయాలు

**టీపీఎన్, హైదరాబాద్:**






న్యూస్ ఛానల్ యాంకర్ స్వేచ్ఛ వోటార్కర్ (40) ఆత్మహత్య చేసుకున్నారు. దాదాపు 18 సంవత్సరాలుగా పలు టీవీ చానల్స్‌లో యాంకర్‌గా పని చేసి బాగా పాపులారిటీ సంపాదించారు. అంతేకాదు TUWJ సెక్రటరీగా పనిచేశారు స్వేచ్ఛ. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ జవహర్ నగర్‌లోని తన నివాసంలో ఉరివేసుకొని సూసైడ్ చేసుకుంది. కేసు నమోదు చేసిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం స్వేచ్ఛ మృతదేహాన్ని గాంధీకి తరలించారు. గాంధీ మార్చురీ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నేతలు, వివిధ ప్రజా సంఘాల నేతలు.. బోరున విలపిస్తున్న స్వేచ్ఛ తండ్రిని ఓదార్చారు. ఈ మేరకు వైద్యులు స్వేచ్ఛ మృతదేహానికి గంటపాటు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె కళ్లను దానం చేశారు. దీంతో స్వేచ్ఛ కళ్లను గాంధీ వైద్యులు సేకరించారు.

**పోస్టుమార్టంలో సంచలన విషయాలు**

స్వేచ్ఛ ఒంటిపై ఎటువంటి గాయాలు లేవని చెప్పారు గాంధీ ఆస్పత్రి వైద్యులు. గొంతుపై ఉరి వేసుకున్న గుర్తులు ఉన్నాయన్నారు. మంచం మీద స్టూల్ పెట్టుకుని లుంగీతో ఉరివేసుకోవడం.. చనిపోయిన తర్వాత కాళ్లు మంచానికి తగలడంతో ఆమె డెడ్‌బాడీ బ్లూ కలర్‌లోకి మారిపోయింని తెలిపారు. దాడి చేసినట్లు గాయాలు లేవన్నారు. ఉరివేసుకున్న తర్వాత మూడు కేజీలు బరువు తగ్గారు.. మూడు నిమిషాల్లోనే చనిపోయారని తెలిపారు వైద్యులు. ఉరి తర్వాత నాలుక కూడా కొరుక్కున్నారని.. మెడ దగ్గర బ్లడ్ సరఫరా ఆగిపోతుందని చెప్పారు. ఇక నోటి వెంట బ్లడ్ కారడం మామూలే అన్నారు. స్వేచ్ఛ కాళ్లు, ముఖంపై ఎలాంటి గాయాలు లేవని చెప్పారు. స్వేచ్ఛ స్టమక్ నుంచి శ్యాంపిల్స్ తీసుకున్నాం.. పురుగుల మందు లాంటివి తీసుకోలేదని తెలిపారు. ఎల్లో ఫుడ్ తీసుకున్నట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది.. అందువల్లే స్మెల్ వస్తోందని చెప్పారు. ఫుడ్ ఏంటనేది ల్యాబ్ రిపోర్టు వస్తే తెలుస్తుందని అన్నారు. స్వేచ్ఛ నుంచి కిడ్నీ, లివర్, కొంచెం స్టమక్ శ్యాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపాం.. 2, 3 నెలల్లో రిపోర్టు వస్తుంది. అనుమానాలు ఉంటే రీపోస్టుమార్టం చేసుకోవచ్చని తెలిపారు గాంధీ ఆస్పత్రి వైద్యులు. ఇక పోస్టుమార్టంలో వీడియో గ్రఫీ తీయలేదు.. ప్రత్యేకమైన కేసుల్లో మాత్రమే వీడియో గ్రఫీ తీస్తామని చెప్పారు.

**పూర్ణచంద్రరావుపై స్వేచ్ఛ తండ్రి ఆరోపణలు**

కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐదేళ్ల క్రితం భర్త నుంచి విడాకులు తీసుకున్న స్వేచ్ఛ.. తన కుమార్తెతో కలిసి పూర్ణచంద్రరావు అనే వ్యక్తితో సహజీవనం చేస్తున్నారు. తన కుమార్తె మృతికి ఆమెతో పాటు సహజీవనం చేస్తున్న పూర్ణచంద్రరావు అనే వ్యక్తే కారణమంటూ స్వేచ్ఛ తండ్రి శంకర్ ఆరోపించారు. గతమూడు నాలుగేళ్లుగా పూర్ణచంద్రరావు తన భార్యకు విడాకులు ఇచ్చి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మానసికంగా వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 26న తన కుమార్తె ఫోన్ చేసిందని స్వేచ్ఛ తండ్రి తెలిపారు. పూర్ణచంద్రరావుతో కలిసి ఉండలేను నాన్న, చాలా గొడవలు అవుతున్నాయి అని చెప్పి బాధపడిందన్నారు. పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని ఆయన పోలీసులకు వివరించారు. పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేయడం వల్లే తన కూతురు తీవ్ర మనస్తాపానికి గురై చనిపోయిందన్నారు శంకర్. స్వేచ్ఛ మృతికి కారణమైన పూర్ణచంద్రరావును కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పూర్ణచంద్రరావుపై కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం పూర్ణ చంద్రరావు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎప్పుడూ చాలా స్ట్రాంగ్‌గా ఉండాలని తనకూ అమ్మ పదేపదే చెప్తూ ఉండేదని స్వేచ్ఛ కూతరు చెప్పింది. ఎవరిని నమ్మవద్దని తనకు అమ్మ చెప్పేదని గుర్తుచేసింది. ప్రతి రోజు అమ్మ హగ్ ఇచ్చి స్కూల్‌కి పంపేది.. రోజులాగే నిన్న కూడా అమ్మ హగ్ ఇచ్చి స్కూల్ కి పంపిందని తెలిపింది. స్కూల్ నుంచి వచ్చేసరికి అమ్మ ఫ్యాన్‌కు వేలాడుతోందని కన్నీరుమున్నీరైంది స్కేచ్ఛ కుతూరు.

**ప్రముఖుల సంతాపం**

స్వేచ్ఛ మరణంపై మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సామాజిక స్పృహ ఉన్న ఓ కవయిత్రిగా, జర్నలిస్టుగా ఎదుగుతున్న స్వేచ్ఛ మరణం అత్యంత విషాదకరమన్నారు కేసీఆర్. ఆమె ఆకస్మిక మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో స్వేచ్ఛ తల్లిదండ్రులు సహచర శంకర్ , శ్రీదేవి కలిసి చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. కన్న బిడ్డను కోల్పోయి శోకతప్త హృదయులైన వారికి కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. స్వేచ్ఛ మృతిపై సంతాపం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక ఆరోపణలు చేశారు. యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య అంశం మీద నుండి ప్రజల దృష్టి మరల్చడానికే కేటీఆర్ మీడియాపై దాడి చేయించారని విమర్శించారు.

### స్వేచ్ఛ చివరి సారి సోషల్ మీడియా పోస్ట్‌లు వైరల్

స్వేచ్ఛ చివరిసారి రాసిన ఆర్టికల్ వైరల్ అవుతోంది. ఉండకుండా పోకు.. ఉండకూడని చోటుకు పోకు.. ఎద బరువు మోస్తుంది.. అలసిపోతుంది.. అలిగిపోతుంది.. పగిలిపోయిన వేళ కనుమరుగైపోతుంది.. అంటూ తన గుండెలోని భారాన్ని అక్షరాల రూపంలో పేపర్‌పై పెట్టింది స్వేచ్ఛ. పుట్టడమూ చావడమూ స్పృశించలేని వ్యధలో నిదురిస్తూనే ఉంటాను.. అంతకంటే ముందే నాకు నువ్వు ఉండకుండా పోకు.. అంటూ ఆమె రాసుకొచ్చిన కవిత ఆమె హృదయలోతుల్లోని బాధను కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. అలాగే స్వేచ్ఛ చివరి ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చివరగా.. ధ్యానం చేసే ఫొటోతో పాటు పలు ఫొటోలను షేర్ చేస్తూ 'Quiet the mind and the soul will speak'అని బుద్ధుడి కోట్‌ను క్యాప్షన్‌గా రాసుకొచ్చారు. మన మనసు ఎప్పుడూ ఆలోచనలతో, భయాలతో, ఆశలతో, సంఘర్షణలతో నిండిపోయి ఉంటుంది. అలాంటి అల్లకల్లోలమైన మనసుతో మన నిజమైన భావాలు మన అంతరాత్మకు కనిపించవు. కానీ మనసు ఆ ఆలోచనల అలజడిని నియంత్రిస్తే.. మన అసలైన భావాల తాలుకు శబ్దం మన లోపల వినిపిస్తుంది. అని దాని అర్థం. ఈ పోస్ట్ ఆమె మానసిక స్థితిని ప్రతిబింబిస్తోంది.



# అమెరికా ప్రతినిధుల బృందం పర్యటన!

- శ్రీకాకుళంలో ప్లాస్టిక్ పరిశ్రమకు ఏర్పాటుకు ప్రయత్నాలు .

**టీపీఎన్, శ్రీకాకుళం :**

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్ట్ ప్రాంత సమీపంలో ఎగ్జాన్మొబిల్ పరిశ్రమ స్థాపనకు అనువైన స్థలాన్ని గుర్తించేందుకు అమెరికా ప్రతినిధుల బృందం శుక్రవారం పర్యటించింది. జాయ్ వెస్ట్కట్ (గ్రోత్ వెంచర్స్ ఆపర్చునిటీ మేనేజర్, సే లింలా (సప్లై చైన్ మేనేజర్), డి.పి. ప్రసన్న (ప్రాజెక్ట్ ఇంజనీర్), శ్రీజ్ రామచంద్రన్ (ఫెసిలిటీ ఇంజనీర్) లతో కూడిన బృందానికి ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి వివరాలు అందించారు. ఈ పరిశ్రమ కోసం 1250 ఎకరాల స్థలం అవసరమని, దీని విలువ సుమారు రూ.83,500 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ప్లాంటులో పాలీ ఇథిలిన్ పాలీప్రొపిలిన్ వంటి ఉత్పత్తులు చేయనున్నట్లు సమాచారం. పోర్ట్ నిర్మాణం, రోడ్డు, రైల్వే లింకులు, పరిసర ప్రాంత భూముల వివరాలను బృందం సమీక్షించింది. పవర్ ప్రెజెంటేషన్‌ద్వారా మూలపేట పోర్ట్ అభివృద్ధి దశలను అధికారులు వారికి వివరించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరావు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడుల ప్రత్యేక దృష్టితో పనులు పోర్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు, అనంతరం బృందం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను అతని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఏపీ ఈడీబీ ప్రతినిధి రంజిత్ కుమార్ సంతబొమ్మాళి తహసీల్దార్ హేమసుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం!

**టీపీఎన్, నెల్లూరు :**

నెల్లూరు జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం కలకలం రేపుతోంది. ఏఎస్ పేట ప్రభుత్వాస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయ్‌గా పనిచేస్తున్న దొరసానమ్మ సూసైడ్ అటెంప్ట్ చేసింది. స్లీపింగ్ ట్యాబ్లెట్స్ మింగడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఎంప్లాయ్ లక్ష్మి వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో తీసుకొని నిద్రమాత్రలు మింగింది బాధితురాలు దొరసానమ్మ. డాక్టర్ సురేశ్‌పై ఇటీవల లక్ష్మి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సురేశ్‌పై డీఎంహెచ్‌వో సుజాత విచారణ జరిపారు. ఈ విచారణలో లక్ష్మికి వ్యతిరేకంగా దొరసానమ్మ వాంగ్మూలం ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వేధిస్తున్నారని దొరసానమ్మ సెల్ఫీ వీడియోలో చెప్పారు. ఈఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సమగ్రదర్యాప్తు చేయాలని ఆదేశించారు.

# కారుణ్య నియామకాలను చేపట్టాలని పోరాటం!

**టీపీఎన్, అమరావతి:**




రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని జిల్లా పరిషత్ స్కూల్స్‌లో కరోనా సమయంలో మృతి చెందిన టీచర్ల కుటుంబాలకు వన్ టైమ్ సెటిల్మెంట్ క్రింద జెడ్పీ పరిధిలో కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరావతి జేఏసీలోని అన్ని సంఘాలతో కలిసి స్థానిక రెవెన్యూ భవన్లో శనివారం నిర్వహించిన ఉమ్మడి గుంటూరు సమావేశంలో అయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరాతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వంలో ప్రతి శాఖలో వేల సంఖ్యలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కరోనా సమయంలో అందరి ప్రజలతోపాటు ప్రభుత్వ వైద్యులు, టీచర్లు, ఉద్యోగులు మరణించారని తెలిపారు. వీరిలో 2744 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వారిలో 1488 మందికి ఉద్యోగాలు జిల్లా కలెక్టర్లు ఉద్యోగాలు కల్పించగా, ప్రభుత్వం మిగిలిన వారికి వన్ టైమ్ సెటిల్ మెంట్ కింద కారుణ్య నియామకాల కల్పించాలన్న ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం జీవోఆర్టీ నంబర్ 1473 జీ.ఏ (సర్వీసెస్ ఏ) డిపార్ట్‌మెంట్ తేదీ 260723 ద్వారా కారుణ్య నియామకాలు కల్పించిందని తెలిపారు. ఆ సమయంలో ప్రభుత్వ నిబంధన మేరకు నియామకాలు ఆలస్యం కావడంతో ఏపీజేఏసీ 92 రోజులు పోరాటం చేసి వన్ టైమ్ సెటిల్మెంట్ జీవో సాధించిందని తెలిపారు. దీంతో 836 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇప్పించగలిగామని, ఇది ఏపీజేఏసీ పోరాట ఫలితమేనని స్పష్టం చేశారు. దీంతోపాటు ఆర్టీసీలో మరణించిన 1200 మందికి కూడా సచివాలయాల్లో ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్మెంట్ మెమో నంబర్ TRB01 TRANSORTC/1/2022 TRP 11 తేదీ 16.2.2022 ద్వారా ఉద్యోగాలు ఇప్పటించగలిగామని తెలిపారు. అయితే ఇదే జీవోలో లోకల్ బాడీస్‌కు కారుణ్య నియామకాలు ఆయా డిపార్ట్ మెంట్లలో మాత్రమే కల్పించాలనే క్లాజ్ చేర్చడంతో జిల్లా పరిషత్ టీచర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వెల్లడించారు. ఈ క్రమంలో సుమారు 4, 5 సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు లేక మృతి చెందిన టీచర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గురువుల పాత్రలో ఉండి మంచి సమాజాన్ని నిర్మించే వారి కుటుంబాల జీవన స్థితి నేడు దీనంగా మారిందని చెప్పారు. సంక్రాంతి సమయానికల్లా జెడ్పీ పరిధిలోని టీచర్లకు కారుణ్య నియామకాలు చేపడతామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ అమలు జరగకపోవడంతో ఆయా కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. తల్లిగానీ, తండ్రిగానీ టీచర్ వృత్తిలో ఉన్నప్పుడు కుటుంబం సంతోషంగా గడిచిపోయిందని, వారు మరణించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జెడ్పీ పరిధిలోని మరణించిన టీచర్ల విషయంలో మెమో 4.12.2013ను సవరించి వన్ టైమ్ సెటిల్మెంట్ కింద ఖాళీలు ఉన్న ఇతర ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను బొప్పరాజు కోరారు.




# జగనన్న కాలనీల పేరుతో భారీ మోసం

**టీపీఎన్, గుంటూరు :**

జగనన్న కాలనీల్లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని విమర్శించారు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. జగనన్న కాలనీతో పేదలకు ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యం మాత్రం నెరవేరలేదన్నారు. పేదలకు ఇళ్ల పేరిట భూములు కొనుగోలు నుంచి నిర్మాణం వరకూ అడ్డగోలుగా దోచుకున్నారని మండిపడ్డారు. జగనన్న కాలనీలు, ఇళ్ల పేరుతో భారీగా వైసీపీ నేతలు అవినీతికి పాల్పడ్డారని ఫైర్ అయ్యారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ అండ్ మోనిటరింగ్ కమిటీ దిశా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తోపాటు ఎమ్మెల్యేలు బి రామాంజనేయులు, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జీఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు, రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ కత్తెర క్రిస్టియానా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆయా పనులు నియోజకవర్గ సంబంధిత వర్కులు పై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పురోగతిపై సమీక్షించారు. జాతీయ రహదారులకు సంబంధించి గుంటూరు వినుకొండ, గుంటూరు నిజాంపట్నం రహదారుల పనులపైనా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని మాట్లాడుతూ విజయవాడ వెస్ట్ బైపాస్ 93% కంప్లీట్ అయింది.. సెప్టెంబర్ ఎండింగ్ కల్లా 100 పూర్తిచేస్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నెంబర్ 6 పేరేచర్ల ఈ రెండు కూడా నెల నెలన్నరలో టెక్నికల్ శాంక్షన్ పూర్తి కావస్తాయన్నారు. పీఎం ఆవాస యోజన హౌసింగ్ స్కీం ద్వారా లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లను గత ప్రభుత్వంలో నివాసయోగ్యాలకు, ఊళ్లకు దూరంగా నిర్మించారు. అక్కడ మౌలిక సదుపాయాలు, రోడ్డు రవాణా, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా తదితరాలు ఏమీ అందుబాటులో లేవన్నారు. దీనిపై ఇండివిడ్యూవల్ గా సైట్ విజిట్ చేసి, మీటింగ్ పెట్టుకుని చర్చించాలని అధికారులను ఆదేశించారు పెమ్మసాని. ఒక నెలలో ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. AIIMS హాస్పిటల్ కి గుంటూరు నుంచి డౌన్ వార్డ్ ర్యాంపు అడిగాము. దానిని కూడా అక్టోబర్ చివరికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఏఏ దశల్లో ఏఏ పనులు ఉన్నాయో తెలుసుకొని ఎప్పటికల్లా పూర్తి చేస్తారని ఆయా అంశాలపై స్పష్టత తీసుకున్నారు కేంద్రమంత్రి.

# కాంగ్రెస్‌లో విభేదాలపై షర్మిల క్లారిటీ!

- **ఎలాంటి పోరులేదు. అంతా కలిసే పనిచేస్తున్నాం- షర్మిల**
- **వైసీపీ చిన్నవాగు.. ఎప్పటికైన కాంగ్రెస్ మహాసముద్రంలో కలవాల్సిందే**
- **రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీకి అధికార, ప్రతిపక్షం గులాంగిరి**



**కాకినాడ:**

ఏపీ కాంగ్రెస్‌లో అంతర్గపోరు నడుస్తోంది.. సీనియర్లు తీవ్ర అంసృప్తిగా ఉన్నారంటూ వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల. రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎటువంటి వర్గపోరు లేదన్నారు. అందరం కలిసి పనిచేస్తున్నామని.. పార్టీ పూర్వ వైభవం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. పార్టీ బలోపేతం కోసమే జిల్లాల పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు షర్మిల. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాలు ముమ్మరం చేస్తామన్నారు. కాకినాడ జిల్లాలో పర్యటించారు షర్మిల.. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడిన షర్మిల వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. మహాసముద్రంలాంటి కాంగ్రెస్‌లో ఎప్పటికైనా చిన్న వాగులాంటి వైసీపీ ఆసముద్రంలో కలవాల్సిందేనని అన్నారు. ప్రజల పక్షాన వైసీపీ చేసేది నిజమైన ఉద్యమం కాదని షర్మిల అన్నారు. జగన్ తన రాజకీయ అవసరాల కోసం మాత్రమే ఉద్యమాలు చేస్తారని విమర్శించారు. బీజేపీపై విమర్శలు చేసే ఉద్యమాల జోలికి జగన్ వెళ్లరని, బీజేపీని జగన్ ఏమీ అనరని ఆమె అన్నారు.

**రాష్ట్రానికి బీజేపీ అన్యాయం**

రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తోందని షర్మిల ఆరోపించారు. విభజన హామీలను విస్మరిస్తోందని, పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించి వినాశనం చేస్తున్నారని, 45 మీటర్ల ఎత్తులో కడితేనే ప్రయోజనం ఉంటుందని, 41 మీటర్ల ఎత్తులో కడితే అది ప్రాజెక్టు కాదని, బ్యారేజ్ మాత్రమేనని ఆమె అన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ఎంపీలు పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. బీజేపీకి బాబు, పవన్, జగన్ గులాంగిరి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రాజధానికి నిధులు కేంద్రం ఇవ్వాలని, కానీ అప్పులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆమె అన్నారు. రాష్ట్రానికి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ అని షర్మిల అన్నారు. కాంగ్రెస్‌తోనే విభజన హామీలు సాధ్యమని, పోలవరం పూర్తి చేయాలంటే, రాజధాని కట్టాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు షర్మిల.

**సంక్షేమ ప్రభుత్వం కాదు.. కోతల ప్రభుత్వం**

ఏపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు షర్మిల. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని ఎద్దేవా చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని, అన్నదాత దుఃఖీభవ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులకు, విద్యార్థులకు, మహిళలకు అన్యాయం జరుగుతోందని వైఎస్ షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులు ఉంటే, అర్హత పేరుతో అన్నదాత సుఖీభవ పథకానికి సగానికి సగం మందికి కోత పెట్టారని అన్నారు. కేవలం 47 లక్షల మందికే పథకం వర్తింపజేస్తారని, ఇది 43 లక్షల మంది రైతులకు చేస్తున్న అన్యాయమని షర్మిల ఆరోపించారు. వడపోత పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తల్లికి వందనం పథకంలో కూడా కోతలు విధించారని అన్నారు షర్మిల. 87 లక్షల మంది విద్యార్థులు ఉంటే, 67 లక్షల మందికే లబ్ధి చేకూర్చారని, 20 లక్షల మందికి మోసం చేశారని ఆరోపించారు. మహాశక్తి పథకాన్ని కూడా మోసం చేశారని.. ఎన్నికల ముందు రూ.1500 P4 కింద లింక్ పెడతామని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు షర్మిల.



# శ్రీశైలం నుంచి తక్షణం నీరు విడుదల చేయాలి!

**టీపీఎన్, కడప:**

శ్రీశైలం జలాశయం నుంచి కె.సి కెనాల్, ఎస్.ఆర్.బి.సి, వెలుగోడు జలాశయాలకు తక్షణం నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వైఎస్ఆర్సిపి నేత, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్డి వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలోని వైఎస్ఆర్సిపి జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 841 అడుగులకు చేరితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరు విడుదల చేయవచ్చని, అయితే నిబంధనల ప్రకారం 854 అడుగులకు నీరు చేరిన వెంటనే కె.సి కెనాల్, ఎస్.ఆర్.బి.సి, వెలుగోడు జలాశయాలకు నీరు విడుదల చేయాలని ఉన్నప్పటికీ, శ్రీశైలంలో 867 అడుగుల నీటి మట్టం ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నీరు విడుదల చేయకపోవడాన్ని ఆయన రైతాంగ వ్యతిరేక చర్యగా నిశితంగా విమర్శించారు.

ఆయన మాట్లాడుతూ, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తక్షణం నీరు విడుదల చేసి కె.సి కెనాల్, ఎస్.ఆర్.బి.సి, వెలుగోడు జలాశయాలకు నీరు సరఫరా చేయాలని, గోరుకల్లు, ఔ కు, గండికోట, మైలవరం వంటి రిజర్వాయర్లను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. అలాగే, వెలుగోడు జలాశయాన్ని నింపి, ఎస్సార్ 1, ఎస్సార్ 2, బ్రహ్మం సాగర్ జలాశయాలను కూడా నీటితో నింపాలని రైతాంగం తరపున ఆయన కోరారు.

అదేవిధంగా, 2.95 టిఎంసి సామర్థ్యంతో రాజోలు జలాశయాన్ని తక్షణం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. 18012025న వైఎస్ఆర్ కడప జిల్లా, మైదుకూరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజోలు జలాశయ నిర్మాణానికి హామీ ఇచ్చినందున, ఈ జలాశయ నిర్మాణం వైఎస్ఆర్ కడప జిల్లాలో 92 వేల ఎకరాల కె.సి ఆయకట్టు కింద ఇరుగారు పంటలు పండించేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్సిపి దువ్వూరు మండల నేత ఇరగం రెడ్డి పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.



# కూటమి పాలనను విమర్శించే హక్కు వైసీపీకి లేదు: మంత్రి సుభాష్

**టీపీఎన్, రామచంద్రపురం:**

కూటమి ప్రభుత్వ పాలనను విమర్శించే నైతికత వైసీపీకి లేదని, ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం ఇచ్చినా వైసీపీ నాయకులు మేకపోతు గాంభీర్యంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. రామచంద్రపురంలో మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 90 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిందని, వైసీపీ నాయకులు దీన్ని ఓర్చలేక చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు, పెంచిన పింఛన్లు, మహిళలకు దీపం పథకం, తల్లికి వందనం, ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ దేశంలో అత్యధిక పింఛన్లు అందించే రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. సీఎం చంద్రబాబు హామీలను నిలబెట్టుకుంటున్నారని, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈల ద్వారా ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి నిరుద్యోగులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అన్న క్యాంటీన్లను గ్రామాల్లోనూ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

వైసీపీ హయాంలో 134 ఎన్నికల హామీలను విస్మరించారని, పోలవరం ప్రాజెక్టును గాలికి వదిలేశారని, రాజధాని లేకుండా చేశారని, నిరుద్యోగులకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా వారి భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను కూడా తుంగలో తొక్కారని, జేబ్రాండ్ మద్యంతో ప్రజల జీవితాలను నాశనం చేశారని, రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని విమర్శించారు. జాకీ, కియా, అమర్ రాజా వంటి పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని, పల్నాడు జిల్లాలో సింగయ్య మరణంపై జగన్ నిర్లక్ష్యం ప్రదర్శించారని దుయ్యబట్టారు. విలువలతో కూడిన రాజకీయం అవసరమని, వైసీపీ డైవర్షన్ రాజకీయాలను విడనాడాలని, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, అమరావతిని రాజధానిగా నిర్మిస్తామని, నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు నూతన పరిశ్రమలు తీసుకొస్తామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలను తగ్గించి, బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని సమానత్వం సాధిస్తామని వెల్లడించారు.

# ఇంటింటికెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించండి!

- **సూపర్ సిక్స్‌లో ప్రతి హామీ అమలు చేస్తాం.**
- **పబ్లిక్ గ్రీవెన్స్ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.**

**టీపీఎన్, నెల్లూరు :**

నిరంతరం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. స్తానిక బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయతి పరిధిలోని 2 వ వార్డులో ఆమె పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11 మంది మెప్మా ఆర్ పి లకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ట్యాబ్స్ అందచేశారు. అనంతరం ఇంటింటికెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పధకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైన్లు, రోడ్ల లాంటి స్థానిక సమస్యలు తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెత్తా చెదారాలు డ్రైనేజ్ కాలువలలో వేయడం ద్వారా మురుగునీటి ప్రవాహానికి ఆటకం ఏర్పడి దోమల వ్యాప్తికి దోహదం చేస్తాయన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రజలకు సూచించారు. కొత్తగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్, వార్డు కమిటీ కార్యవర్గాలకు ఆమె శుభాకాంక్షలు తెలియచేశారు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో రూ.3 కోట్లతో రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డులో పర్యటించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా వున్నారన్నారు. ప్రభుత్వం దశల వారీగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే మత్స్యకార భరోసా, తల్లికివందనం, ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు పంపిణి చేపట్టిన ప్రభుత్వం రానున్న ఆగస్టు 15 న మహిళలకు ఉచిత బస్సు అనంతరం అన్నదాత సుఖీభవ హామీలను అమలు చేయనున్నట్లు ఆమె ప్రకటించారు. కార్యకర్తలు ఇంటింటికెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రజాహిత కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని ఆమె నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం పట్టణ మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, స్థానిక కౌన్సిలర్ కళ్యాణ్, వైస్ ఛైర్మెన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, బుచ్చి మండల టిడిపి అర్బన్ రూరల్ మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, బెజవాడ జగదీష్, తెలుగుదేశం నాయకులు ఎంవి శేషయ్య, రామానాయుడు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.





## రంగస్థల కళాకారులకు ప్రభుత్వం అండ..!

**టీపీఎన్, శ్రీకాకుళం :**

రంగస్థల కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు. శంకర్ అన్నారు. స్థానిక ఎస్పీ బంగ్లా దారిలోగల శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన భవనం ప్రారంభవోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నటరాజ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. శ్రీకాకుళంలో కళాకారులకు కొదవలేదని, జిల్లా నుండి సినీ రంగంలోకి అనేకమంది కళాకారులు జిల్లా నుండి వెళ్లి, సుస్థిర స్థానం సంపాదించారన్నారు. కళాకారులు సమాఖ్య ద్వారా నగరంలో జరిగిన అనేక కార్యక్రమాలలో తాను ఇది వరకు పాల్గొన్నానని, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్యకు అన్నివిధాలా తన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. టీడీపీ ఉపాధ్యక్షులు పీఎంజే బాబు ఇండోర్ స్టేడియం ఉండాలనే అంశాన్ని పరిశీలించామని, అందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలో కార్యాచరణ జరిగే విధంగా చూస్తానన్నారు. అనంతరం కళాకారుల సమాఖ్య సభ్యులందరూ గొండు.శంకర్ ను దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, రంగస్థల కళాకారుల సమైక్య సభ్యులు ఎల్ రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్ర దేవ్, పిఎంజె బాబు, చిట్టి నాగభూషణం, రమణారావు, కవ్వాడీ సుశీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన లారీ యజమానులు ..!

**టీపీఎన్, విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు తమకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలు — క్రషర్ పరిశ్రమపై ఆధారపడి నడిచే లారీ వ్యాపార పరిస్థితులు, పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల వ్యయ భారం, టోల్ గేట్ల వద్ద వేధింపులు, రోడ్ గ్రాంట్లు ఆలస్యం, ఎ.టి.ఎస్. నెంబర్ల కారణంగా ఎదురవుతున్న సమస్యలను మంత్రి కి విన్నవించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రవాణా రంగాభివృద్ధికి అవసరమైన విధానాలను రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైలర్ అసోసియేషన్ సెక్రటరీ సురపనేని సురేష్, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ రావి శరత్, ఎ. సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.



## మీడియాపై బీఆర్ఎస్ దాడులు ప్రజాస్వామ్యానికి విఘాతం..!

- **మహాన్యూస్ పై దాడిని ఖండించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
- **పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్న దగ్గుపాటి**

**టీపీఎన్, అనంతపురం :**

హైదరాబాద్‌లో మహాన్యూస్ కార్యాలయంపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కల్గించే చర్యగా భావించాల్సి ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మహాన్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఫోన్ ట్యాపింగ్ అంశం అన్నది తెలంగాణంలో గత కొంతకాలంగా నడుస్తోందన్నారు. దీనిపై మీడియా ప్రతినిధులు తమకు అందిన సమాచారం మేరకు వార్తలు ప్రసారం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మహాన్యూస్ ప్రసారం చేసిన అంశాలు మీకు ఇబ్బంది కల్గించి ఉంటే వాటిని మరో రూపంలో ఖండించాల్సి ఉందన్నారు. లేదా చట్టపరంగా ముందుకెళ్లవచ్చన్నారు. కానీ అవన్నీ మానేసి ప్రజాస్వామ్యంలో ఒక రాజకీయ పార్టీగా ఉంటూ బాధ్యత మరిచి ప్రవర్తించడం సరికాదన్నారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ లో ఇలాంటివి జరగకుండా మహాన్యూస్‌కు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# రూ.330 కోట్లతో రేమండ్ గార్మెంట్స్ యూనిట్.. 3 వేల మందికి ఉపాధి..!



**టీపీఎన్, అనంతపురం :**

రాప్తాడు నియోజకవర్గంలో ప్రముఖ గార్మెంట్స్ సంస్థ రేమండ్ యూనిట్ స్థాపనకు సిద్ధమవుతోంది. గతంలో జాకీ పరిశ్రమ కోసం ఎంచుకున్న స్థలంలోనే ఈ కొత్త పరిశ్రమ ఏర్పాటవుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురం కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో జాకీ పరిశ్రమ స్థాపనకు ప్రయత్నాలు జరిగినప్పటికీ, అధికార మార్పిడి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బెదిరింపుల కారణంగా ఆ సంస్థ హైదరాబాద్‌లో యూనిట్ ఏర్పాటు చేసిందని ఆమె వివరించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో రేమండ్ సంస్థ రాప్తాడులో యూనిట్ స్థాపించేందుకు ముందుకొచ్చిందని సునీత పేర్కొన్నారు. 26.87 ఎకరాల భూమిని ఎకరాకు రూ.20 లక్షల చొప్పున కేటాయించారు. రూ.330 కోట్ల స్థిర మూలధన పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మితమవుతుందని, ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా అందిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా 3,000 మందికి ప్రత్యక్ష ఉపాధి, మరి కొందరికి పరోక్ష ఉపాధి లభిస్తుందన్నారు.రాప్తాడును పారిశ్రామిక కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమని, దాదూలూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించామని, చెన్నేకొత్తపల్లిలో 4,000 ఎకరాల్లో రైతుల సహకారంతో మరిన్ని పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సునీత వెల్లడించారు. హంద్రీనీవా ద్వారా నీటి సరఫరాతో నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తూనే, పారిశ్రామికీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని అందించే పనులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న నాలుగేళ్లలో ఈ లక్ష్యాలను సాధిస్తామని సునీత స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సమర్థవంతమైన నాయకుల ఎంపికతోనే పార్టీ బలోపేతం..!

**టీపీఎన్, సూళ్లూరుపేట :**

గ్రామ స్థాయి నుంచి సమర్థవంతమైన నాయకులను సమన్వయంతో ఎంపిక చేస్తే పార్టీ బలపడుతుందని టీడీపీ పరిశీలకుడు డాక్టర్ శివప్రసాద్ స్పష్టం చేశారు. పట్టణంలోని సత్య సాయి కళ్యాణ మండపంలో టీడీపీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో టీడీపీ పరిశీలకుడు డాక్టర్ శివప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే నాయకులకు ప్రాధాన్యత ఇస్తే, 2029లో కూటమి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు వీలవుతుందని అన్నారు.అయితే, సమావేశానికి హాజరైన మీడియా ప్రతినిధులకు కుర్చీలు కూడా లేకపోవడం వివాదాస్పదమైంది. వార్తల కవరేజీ కోసం వచ్చిన విలేకర్లను నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో వారు మెట్లపై కూర్చోవడం లేదా నిలబడి ఉండాల్సి వచ్చింది. ప్రతి సమావేశంలో ఇలాంటి పరిస్థితి కొనసాగడంపై మీడియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు మీడియాకు తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. పార్టీ బలోపేతంపై చర్చలు జరుగుతుండగా, మీడియా పట్ల నిర్లక్ష్యం విమర్శలకు దారితీసింది. ఈ సమావేశంలో పరిశీలకులు చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, రాయి సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, పచ్చిగార్ల రత్నం, షేక్ రఫీ, నువ్వుల శివరామకృష్ణ, టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..!

**టీపీఎన్, శ్రీకాకుళం :**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు .శనివారం పోలాకి మండలం మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని అందులో రూ.2000 పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని వివరించారు. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించడానికి సెమిస్టర్ విధానంలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం వినియోగిస్తున్నామని అన్నారు.ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నామని, అర్హత గల ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారని వివరించారు. బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు ,కాయ రవి,ధర్మాన అమ్మనాయుడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు..!

**టీపీఎన్, లూరు :**

ద్వారకాతిరుమల మండలం దేవినేని వారి గూడెంలో వైసీపీ నాయకులు టీడీపీ కండువా కప్పుకున్నారు. రామన్నగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు చెరుకూరి ప్రసాదరావు, యువ నాయకుడు భద్ర రావుతో సహా సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలోనే దేవినేని వారి గూడెం వద్ద ఉన్న గుర్రాల వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామని, అదేవిధంగా తిమ్మాపురం నుంచి వీరిశెట్టి వారి గుడం వరకు రహదారి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి చూసి వైసీపీలోని నాయకులు టీడీపీలోకి చేరుతున్నారని, రాబోయే రోజుల్లో గ్రామాల్లో వైసీపీ ఉండబోదని, ప్రజా పరిపాలన, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు పాకలపాటి గాంధీ, ఏపూరి దాలయ్య, దేవరపల్లి వీరాస్వామి చౌదరి, మద్రాస్ రాము, పోలిన శ్రీను, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చే అక్షయ పాత్ర అన్న క్యాంటీన్..!

**టీపీఎన్, రామచంద్రపురం:**



అన్నదానం మహోన్నత కార్యమని, కేవలం రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను అందించడం సామాన్యమైన విషయం కాదని ఆర్డీవో అఖిల అన్నారు. శనివారం స్థానిక అన్న క్యాంటీన్‌నుఆ ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణంలో అందించేలా చూడాలని, ఆర్టీజీఎస్, ఐవీఆర్ఎస్ ద్వారా లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరిస్తుందని తెలిపారు. మెనూ ప్రకారం సమయపాలన, నాణ్యత ప్రమాణాలతో తాజా భోజనం వడ్డించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.లబ్ధిదారులతో మాట్లాడగా, వారు భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించి దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. అనంతరం, స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన ఆర్డీవో.. వైద్య సేవలను రోగులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. ఓపీ రోగుల సంఖ్యకు సరిపడా కౌంటర్లు లేకపోవడంతో మరో కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌ను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవల పథకం కింద రోగులకు ఉచిత వైద్యం, ఆహారం, రవాణా సౌకర్యాలు సక్రమంగా అందాలని సూచించారు. ఔషధాల సరఫరా, బిల్లుల చెల్లింపు, బయటి నుంచి ఔషధాల కొనుగోలు వంటి అంశాలను రోగుల ద్వారా విశ్లేషించారు. వైద్య వృత్తి ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ మృత్యుంజయ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిందితులకు శిక్ష పడటంలో కోర్టు కానిస్టేబుళ్లే కీలకం..!

**టీపీఎన్, ఏలూరు :**




వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష పడేందుకు కోర్టు కానిస్టేబుళ్లే కీలకమని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ మీటింగ్ హాల్ నుంచి జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం నూజివీడు, పోలవరం సబ్‌డివిజన్‌లలోని ఎస్ఐలు, ఇనస్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో అదనపు ఎస్పీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, కోర్టు కానిస్టేబుల్ విధి నిర్వహణ చాలా ప్రముఖమైనదన్నారు. అధికారులు కేసు నమోదు చేసిన వెంటనే ఆ కేసుల్లో దర్యాప్తును పూర్తి చేసి ఛార్జ్ షీట్‌ను కోర్టులో ఫైల్ చేసిన తర్వాత ముద్దాయికి శిక్ష పడటంలో ప్రముఖమైన పాత్ర గురుతర బాధ్యత పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్‌పై ఉందన్నారు. ఏలూరు జిల్లాలో ఎవరైనా నేరస్థుడు నేరం చేయాలంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా కోర్టులో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా కోర్టు కానిస్టేబుల్ విధి నిర్వహణ చేయాలని సూచించారు. ఉద్యోగ నిర్వహణలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కోర్టు కానిస్టేబుల్ లకు నగదు, ప్రశంసా పత్రంతో సత్కరిస్తామన్నారు.

## లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు అభినందనీయం..!

**టీపీఎన్, శ్రీకాకుళం :**

సమాజంలోని అభాగ్యులకు నిరంతరం సేవలందించడంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కీలక పాత్ర పోషిస్తోందని శ్రీకాకుళం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె. మహేశ్వర రెడ్డి అన్నారు. యోగాంధ్ర విజయోత్సవాలలో భాగంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రాన్ని, జోన్ చైర్మన్ లయన్ పొన్నాడ.రవి కుమార్, నూతన అధ్యక్షురాలు లయన్ డా. పైడి సింధూర అందించి మాట్లాడారు. యోగాంధ్ర విజయయోత్సవాలలో ఎస్పీ మహేశ్వర రెడ్డి ముఖ్య పాత్ర పోషించి పోలీస్ విభాగంలో అడుగడుగునా సహాయ, సహకారాలు అందించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో యోగాంధ్ర విజయోత్సవాలకు విశాఖపట్టణం వేదిక కాగా, శ్రీకాకుళం జిల్లా నుండి అన్నీ తానై నడిపించారన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యోగాంధ్ర విజయంలో బాగమవ్వటం మాటలకందని ఆనందంగా ఉందని, శ్రీకాకుళం ప్రజలను విజయతీరాలకు చేర్చి, శ్రీకాకుళం జిల్లాను ప్రపంచ స్థాయి గిన్నిస్ బుక్ లో స్థానాన్ని నిలిపారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, శ్రీకాకుళం యువ కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి కృషి ఫలితమే యోగాంధ్ర విజయోత్సవమన్నారు. ముఖ్యంగా జిల్ల అధికార బృందం, ఆయుష్ విభాగం, యోగా గురువులు,యోగా సాధకులు, ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ అహర్నిశలు కష్టపడ్డారన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతీ ఒక్కరినీ గుర్తించి, ప్రతీ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నారని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్ష బృందానికి ప్రత్యేక అభినందనలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యదర్శి టెక్కం. రామ్ గోపాల్, నూతన ఉపాధ్యక్షులు ఉర్లం. శివతేజ పట్నాయక్ పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత జీవనానికి సహజయోగ..!

టీపీఎన్, ఏలూరు : ప్రస్తుత వేగమయమైన జీవితంలో ప్రతిఒక్కరూ ఒత్తిడితో జీవితాలను గడపాల్సివస్తోందనీ, వాటిని యోగ, ధ్యానపద్ధతులను అవలంభించటం ద్వారా జయించొచ్చునని సహజయోగ ధ్యాన కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ అన్నారు. ప్రపంచ శాంతి కోరుతూ శ్రీ మాతాజీ నిర్మలా దేవి ఆశయానికి అనుగుణంగా దేశవ్యాప్తం చేపట్టిన సహజయోగ ప్రచార రధయాత్ర ఏలూరు జిల్లా లో పర్యటిస్తోంది. సహజయోగ ధ్యానపద్ధతులపై అవగాహన కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. సహజయోగ ద్యాన కేంద్రం రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు హనుమంతరావు, ఏలూరు జిల్లా కో కోఆర్డినేటర్ కాకి విజయలక్ష్మి మా ట్లాడుతూ ఎంత బిజీగా జీవితాన్ని గడుపుతున్నా సమాజ పరంగా ఎదురయ్యే ఒత్తిడులను తగ్గించుకోవాలనీ, లేకుంటే ఆరోగ్యపరంగా అనేక రుగ్మతలను ఎదుర్కోవాల్సివస్తుందన్నారు. ఒత్తిడిని జయించకపోయి దీర్ఘకాలిక మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. సహజయోగ ధ్యాన ప్రక్రియలు, వైద్య విధానం ద్వారా ఒత్తిళ్లను జయించొచ్చునన్నారు. ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లోని ప్రజలు సహజయోగ ధ్యానాన్ని ఆచరిస్తున్నారన్నారు. సాధారణ వ్యక్తులు, సహజయోగ ధ్యానం చేసే వారి మధ్య ఆరోగ్య సమస్యల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కూడా ఇదే విషయాన్ని గుర్తించిందన్నారు. అనేక వైద్య విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు కూడా సహజయోగ వైద్య పద్ధతులు చాలా ఆచరణాత్మకంగా ఉన్నాయని గుర్తించాయన్నారు. పశిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ మణి, ఏలూరు నగర కోఆర్డినేటర్ రాజేశ్వరి మాట్లాడుతూ సహజయోగ యోగ ధ్యాన పద్ధతులను ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజలు ఆచరిస్తున్నారన్నారు. సహజయోగ ధ్యానం చేయటం ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, సఅజనాత్మక శక్తి, చురుకుతనం, చదువు, లలిత కళలపై ఆసక్తి, వాక్చాతుర్యం, మెదడు వికాసం మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సహజయోగ సాధకులు పాల్గొన్నారు.



## వీనుల విందుగా అన్నమయ్య పదామృత వర్షిణి..!

**టీపీఎన్, శ్రీసిటీ :**




ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన అన్నమయ్య పదామృత వర్షిణి కార్యక్రమం ఆద్యంతం సంగీత ప్రియులకు వీనుల విందు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా అన్నమయ్య కీర్తనలు, రచనల గొప్పతనాన్ని వివరిస్తూ కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. ఆయనకు తోడుగా నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష కొన్ని అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. శంకర రావు తన ప్రసంగంలో లోతైన విశ్లేషణతో అన్నమయ్య ప్రాశస్త్యాన్ని వివరించారు. పలువురు ప్రముఖ కవులు తమ ప్రబంధ సాహిత్యాన్ని రాజులను మెప్పించేందుకు వాడితే, వేదాలలో వున్న సారాన్ని అచ్చ తెలుగులో సంగీతంగా మలచి వేంకటేశ్వరస్వామికి సమర్పించడంతో పాటు ఆయనను ఊరూర తిప్పిన సామాజిక స్పృహ కలిగిన ప్రజా కవి అన్నమయ్య అని ఆయన అభివర్ణించారు. శంకరరావు ప్రసంగం అనంతరం, 'ఆమె బ్రహ్మం ఒక్కటే', 'చక్కని తల్లికి', 'అదిగో అల్లడిగో', 'చిన్ని సిసువు' ఇతర పలు అన్నమయ్య సంకీర్తనలను గాయకురాలు మల్లాది అనూష వాయిద్య కళాకారులతో కలిసి శ్రావ్యంగా ఆలపించారు. ప్రతి సంకీర్తనకు ముందు శంకరరావు ఆ కీర్తనకు సంబందించిన సారాంశాన్ని, గొప్పదనాన్ని వివరిస్తూ గానామృతాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తన సందేశంలో వ్యాఖ్యానించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, అన్నమాచార్య రచనలు కేవలం భక్తి గీతాలు మాత్రమే కాదని, అవి ప్రజలను జాగృతం చేసే తత్వ బోధనలన్నారు. ఇటువంటి వారసత్వ సంపదను కొత్త తరాలకు వివరించే ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి శ్రీసిటీశ్రీవాణి వేదిక కావడం తమకు గర్వకారణమన్నారు. కళాకారులు శంకరరావు, కుమారి అనూష, ఇతర బృంద సభ్యులను ఆయన అభినందించారు. నిర్వాహకులు తరపున తిరుపతి శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్ కె యూనివర్సిటీ మాజీ ఉప కులపతి శ్రీమతి కుసుమ కుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించగా, శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సూళ్లూరుపేట, శ్రీహరికోట మరియు శ్రీసిటీ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ఇందులో పాల్గొన్నారు.

## పోక్సో కేసు నిందితుడికి 20 ఏళ్ళ జైలు శిక్ష

- **బాధితురాలికి 50 వేల పరిహారం ఇవ్వాలి**
- **పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి వాణిశ్రీ తీర్పు**

**టీపీఎన్, ఏలూరు :**

బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ బాధితురాలికి 50 వేల రూపాయల పరిహారం ఇవ్వాలని పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి కే వాణిశ్రీ శనివారం తీర్పు చెప్పారు. పోక్సో కేసులో వేగవంతంగా దర్యాప్తు జరిపి ముద్దాయికి శిక్ష పడేలా జిల్లా పోలీసులు చర్య తీసుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు జంగారెడ్డిగూడెం సుబ్బంపేట కాలనీలో షేక్ ఇబ్రహీం (45) మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. బాధిత బాలికను పాఠశాల, ట్యూషన్ సెంటర్ వెళ్లే సమయాల్లో తినుబండారాలు ఇచ్చి లోబర్చుకొన్నాడు. గత ఏడాది ఫిబ్రవరి ఆరో తేదీ ముందు వరకు బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. బాధితురాలు తరచూ ఆలస్యంగా ఇంటికి వస్తుండటాన్ని గమనించిన బాలికను ఆమె నానమ్మ ప్రశ్నించి, జరిగిన విషయం తెలుసుకుని గత ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇచ్చింది. దీనిపై అప్పటి జంగారెడ్డిగూడెం ఎస్ఐ జీ జ్యోతిబస్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును జంగారెడ్డిగూడెం అప్పటి డీఎస్పీ ఎం ధనుంజయుడు, తదుపరి యు రవిచంద్ర, దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి కె వాణిశ్రీ నిందితుడు షేక్ ఇబ్రహీంకు 20 సంవత్సరాల జైలు శిక్ష, 5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. అలాగే బాధిత బాలికకు 50 వేల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ముద్దాయికి శిక్ష పడటంలో సహకరించిన సిబ్బందిని ఏలూరు జిల్లా ఎస్ పీ ప్రతాప్ శివ కిశోర్ అభినందించారు.



## రైతులకు నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చూడాలి..!

**టీపీఎన్, కడప:**



జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా.. ఉద్యాన పంటలు, వృక్షాలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా జేసీ అధితి సింగ్ సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణలో ఉద్యాన పంటలు , చెట్లు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అంచనా ప్రక్రియపై.. శనివారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి సంబందిత అధికారులు, ఆయా డివిజన్ల ఆర్డీవోలు, తహశీలర్లతో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జేసీ అదితి సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. బెంగుళూరుకడపవిజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి.. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా.. చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో జమ్మలమడుగు, వి.ఎన్. పల్లె మండలాల్లో ఉద్యాన పంటలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం రాకుండా.. భూసేకరణ చట్టంలోని సంబందింత ప్రామాణికాలను పక్కాగా పాటిస్తూ.. పరిహారం అంచనాలను నివేదించాలన్నారు. వృక్షాల వయస్సు, చెట్ల పెంపకానికి ఎరువులు, ఫర్టిలైజర్స్ ఇతర నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు రైతులు వెచ్చించిన వ్యయం తదితర అంశాలను ఉద్యాన వన శాఖ అధికారులు ఖచ్చితంగా, పారదర్శకంగా వ్యాల్యుయేషన్ చేయాలన్నారు. వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. కాగా.. ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో.. ఎస్డీసి, ఎన్ హెచ్ పీడి వెంకటపతి, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు సాయిశ్రీ, చిన్నయ్య, ఎన్ హెచ్ఏఐ పీడి అశోక్ కుమార్, ఆర్&బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్ హెచ్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగనపూడిలో సీపీఎం భూస్వాధీనోద్యమం..!

**టీపీఎన్, మండవల్లి :**




సింగనపూడిలో ఫీల్డ్ లేబర్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో భూస్వాధీనోద్యమం నిర్వహించారు. సింగనపూడి ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ భూములు మావే.. లీజు ఇవ్వకుండా అక్రమంగా అనుభవిస్తున్న లీజు దారులు మా భూముల నుండి వెంటనే తప్పుకోవాలంటూ వారు నినాదాలు చేశారు. తొలుత సింగనపూడి గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి గ్రామ దళితులు, ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు ఎర్రజెండాలతో సొసైటీ భూముల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫీల్డ్ లేబర్ సొసైటీ ముందు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించి ఎర్రజెండాలను ఎగరవేసి సొసైటీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సింగనపూడి దళితులకు చెందిన ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ భూములను లీజు పేరుతో లీజు చెల్లించకుండా దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఇది చట్టవిరుద్ధమన్నారు. రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. సొసైటీ భూములు లీజు పేరుతో అక్రమంగా అనుభవిస్తున్న కైకలూరు చెందిన పెత్తందారు మాడపాటి కృష్ణ ప్రసాద్ నుండి దళితులైన సింగనపూడి ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా లీజు చెల్లించకుండా దళితులపై దౌర్జన్యం చేస్తున్న మాడపాటి కృష్ణప్రసాద్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ఎగ్గొట్టిన లీజు సొమ్ములు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. దళితుల భూపోరాటానికి సిపిఎం అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ మహంకాళీ రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు వై.దానియేలు, పి. ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగనపూడి ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కె. జగదీష్, కార్యదర్శి ఉచ్చుల సుధీర్ కుమార్, సొసైటీ సభ్యులు పక్కిరి దావీదు, పక్కిరి జేమ్స్, బొడ్డు ఆనందరావు, పక్కిరి పౌలు, యెహోషువ, బొడ్డు చింతయ్య,మేరుగు సునీత, వెంకటేశ్వరరావు,పులవర్తి కవలమ్మ, పాముల సుశీల తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలకు రూ.12 కోట్లతో తాగునీటి పథకం..!

**టీపీఎన్, విజయనగరం :**

స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలకు రూ.12 కోట్లతో తాగునీటి పథకం నిర్మాణాన్ని 10 రోజుల్లో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. చంపావతి నదిపై మొయిద వద్ద రోజుకు 1 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే ఈ పథకం నిర్మితమవుతుంది. శనివారం అధికారులతో జరిగిన సమావేశంలో నీటి లభ్యత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు.కలెక్టర్ మాట్లాడుతూ.. పథకం పనులను ఏడాది లోపు పూర్తి చేయాలని, రాబోయే ఏడాదిలో పీజీ కోర్సుల ప్రారంభంతో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 1 ఎంఎల్‌డీ సామర్థ్యంతో పథకాన్ని వేగంగా నిర్మించాలన్నారు. కళాశాలలోని 6 బోరుబావుల్లో నీటి రీఛార్జ్ కోసం నీటి సేకరణ కట్టడాలు, సంప్ ట్యాంకును వారంలో నిర్మించాలని సూచించారు. తాత్కాలికంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ట్యాంకర్ల ద్వారా వారం రోజులు నీటిని సరఫరా చేయాలని, జేఎన్‌టీయూ జంక్షన్ నుంచి కళాశాల వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మలీల, మున్సిపల్ కమిషనర్ పీ నల్లనయ్య, డీపీవో మల్లిఖార్జున రావు, గ్రౌండ్ వాటర్ డీడీ జీ శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఈడీసీ ఈఈ ఎన్ భారతి, పబ్లిక్ హెల్త్ ఈఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.






# పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ..!

**టీపీఎన్, ఏలూరు :**

పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశం కొరకు ప్రభుత్వం నిర్వహించే రాష్ట్ర స్థాయి పరీక్ష ఫలితాల్లో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనపరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ గిరిబాబు తెలియచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో, ఎమ్మెస్సీ జువాలజీలో రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంక్ సాధించిన కె నవీన్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెస్సీ జువాలజీలో వరుసగా 245,354 ర్యాంక్‌లు సాధించిన సీహెచ్ జగదీష్, షేక్ షారూన్, ఎమ్ఏ పొలిటికల్ సైన్స్‌లో వరుసగా 214,249,256 ర్యాంక్‌లు సాధించిన చంద్రశేఖర్, మనోజ్ శ్యామ్ సాయి, హేమ వెంకట సత్యనారాయణను కూడా ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఇక్కడ విద్యార్థులు స్వతంత్ర భావజాలంతో తమ జీవితాల్లో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి కావాల్సిన పునాదులు వేసుకుంటారని.. కావున త్వరలో జరగబోవు డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరవలసిందిగా కోరారు. అనంతరం విద్యార్థులకు పీజీ ర్యాంక్‌లు రావడం కోసం తర్ఫీదునిచ్చిన జువాలజీ అధ్యాపకులు డాక్టర్ ఎం విజయ్ కుమార్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టీవీఎస్ దుర్గా ప్రసాద్‌ను ప్రిన్సిపాల్, సహచర అధ్యాపకులు అభినందించారు.



# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి..!

**టీపీఎన్, ఏలూరు:**

కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) గోడౌన్‌ను కలెక్టర్ కె. వెట్రి సెల్వి శనివారం తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌లో భద్రతా సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈవీఎం గోడౌన్‌కు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గోడౌన్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, ఎన్నికల సంఘానికి నివేదికలు పంపిస్తున్నామని చెప్పారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు యు. బాలానందం (టీడీపీ), ఏ. రతన్ కాంత్ (బీఎస్పీ), నెరుసు నెలరాజు (బీజేపీ), పి. ఆదిశేషు (సీపీఎం), ఎస్. బాబు ప్రసాద్ (ఐఎన్‌సీ), వి. స్టాన్లీ బాబు (వైఎస్ఆర్‌సీపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం..!

**టీపీఎన్, మచిలీపట్నం:**

చట్టాలపై అవగాహన కలిగి ఉండి, అవసరం మేరకు మాత్రమే వాటిని ఉపయోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గుట్టాల గోపి అన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్తంగా నూతన తరహా న్యాయ సేవల శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థలకు మధ్య జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారధిగా ఉండి పని చేస్తుందన్నారు. సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉంచడం, సాంఘిక దురాచారాల పోరాటంపై ప్రజలకు అవగాహన కల్పించడం, పిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా దూరమైన వారిని గుర్తించి వారికి చేరువ చేసేలా చర్యలు తీసుకోవడంపై డీఎల్ఎస్ఏ విశేష కృషి చేస్తుందన్నారు. డీఎల్ఎస్ఏ ప్రజలకు న్యాయ సేవలను ఉచితంగా అందిస్తుందని.. అయితే ఉచితంగా అందించే సేవల పట్ల చులకన భావన కలిగి ఉండొద్దని, మార్పు అవసరం అని చెబుతూ న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంఘిక దురాచారాలపై పోరాటంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయ సేవలను ప్రజలకు అవగాహన కల్పించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. కోర్టు కేసులకు సంబంధించి, న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని పేద ప్రజలు డీఎల్ఎస్ఏను సంప్రదిస్తే న్యాయవాదిని ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. లోక్ అదాలత్ కోర్టు ద్వారా ఎటువంటి కేసులనైనా సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఇరువురు రాజీ పడే అవకాశం కల్పిస్తుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ. నిస్సహాయ స్థితిలో ఉండి న్యాయ సహాయం అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని, దీనిపై అవగాహన కలిగి డీఎల్ఎస్ఏ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# అమ్మవారికి ఆషాడమాసం సారె..!

దుర్గమ్మకు చిట్టినగర్ శ్రీ నగరాల కొత్త అమ్మవారి దేవస్థానం దశావతార అమ్మవారి భక్త బృందం ఆషాడమాసం సారెను సమర్పించింది. ఊరేగింపుగా మేళతాళాలతో, డప్పులతో, భక్తి శ్రద్ధలతో బయలుదేరి ఆంజనేయ వాగు, నేరుబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, కనకదుర్గ నగర్ మీదుగా వెళ్లి అమ్మవారికి సారే సమర్పించారు. అమ్మవారికి పట్టు చీర పసుపు కుంకమతోపాటు 21 రకాల సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోతిన విజయలక్ష్మి, పిళ్ళా మాధవి, పోతిన పుష్పలత, పోతిన భవాని, అడ్వకేట్ పోతిన పుష్పలత, తాట్రాజుల ఉమాదేవి, గుజ్జారి భవాని, పోతిన దుర్గ భవాని, పిల్ల రాణి, పిల్ల హారతి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్బీఐ, ఆర్టీడ్స్ ఆధ్వర్యంలో బ్యాంకు డిపాజిటర్లకు వర్క్‌షాప్..!

టీపీఎన్, తెనాలి : కటివరం గ్రామానికి చెందిన ఆర్టీడ్స్ సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సహకారంతో బ్యాంకు డిపాజిటర్ల కోసం ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. మంగళగిరి నియోజకవర్గంలోని దుగ్గిరాల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంకు లావాదేవీలు, రుణాలు, డిపాజిట్లు, ఖాతాదారుల హక్కుల గురించి వివరించారు. బ్యాంకు ఖాతాదారులు తమ హక్కులను ఎలా కాపాడుకోవాలి, రుణాలను ఎలా పొందాలనే అంశాలపై అవగాహన కల్పించారు.రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎన్. కాళహస్తి మాట్లాడుతూ, ఆర్బీఐ నియమాలు, ప్రభుత్వ పథకాలు, రైతు రుణాలు, చిన్న మరియు పెద్ద పరిశ్రమలకు సబ్సిడీపై అందే రుణాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై మహిళలకు వివరించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ మేనేజర్, రిసోర్స్ పర్సన్ ఆర్.ఎస్. శంకర్ రావు మాట్లాడుతూ, డిపాజిటర్ల హక్కులు, డిపాజిట్ మోసాలు, కేవైసీ అవసరాలు, బ్యాంకింగ్ మోసాలు, పొదుపు ప్రాముఖ్యత, గార్మెంట్ ఖాతా ప్రమాదాలు, మహిళల స్వయం సహాయక సంఘాల పొదుపు విధానం, మైక్రో ఫైనాన్స్, భీమా పథకాలు, అటల్ పెన్షన్ యోజన, పంట రుణాలు, కిసాన్ యోజన, పంటల బీమా వంటి విషయాలను వివరించారు. ఈ డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమంలో ఆర్టీడ్స్ రాష్ట్ర సమన్వయ కర్త షేక్ హుస్సేన్, ఆర్టీడ్స్ సంస్థ కార్యదర్శి ఎర్రు సాంబశివరావు ప్రసంగించారు.






# సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం..!

**టీపీఎన్, కుప్పం :**

కుప్పం ద్రావిడ వర్సిటీలో గుడుపల్లె టీడీపీ అధ్యక్షుడు బాబు నేతృత్వంలో కూటమి నేతలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో బాబు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో ద్రావిడ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేశారని అన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తున్న సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుతో ద్రావిడ యూనివర్సిటీ అభివృద్ధి చెందుతుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయనీయం..!

- **దాడిని ఖండిస్తూ జర్నలిస్టుల కొవ్వొత్తులు ర్యాలీ**
- **దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి....**

**టీపీఎన్, విజయనగరం:**

తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ఛానెల్ అయిన మహాన్యూస్ పై బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు దాడి చేయడాన్ని విజయనగరం జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. దాడిని ఖండిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక కోట వద్ద నుండి మూడు లాంతర్లు జంక్షన్ వరకూ జర్నలిస్టులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దాడిని ఖండిస్తూ నిజానిజాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మీద వస్తున్న వార్తలకి వివరణ ఇవ్వ కుండా సహనం కోల్పోయి బీఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొల్పి మహా న్యూస్ కార్యాలయం మీద దాడిచేసి కార్లు, ఫర్నీచర్ ను, అద్దాలు , కెమెరా లను ధ్వంసం చేయడంతో పాటు మహా న్యూస్ చైర్మన్ అండ్ ఎండీ వంశీకృష్ణ మీద, ఇతర జర్నలిస్టుల మీద దాడికి యత్నించడం, హత్యాయత్నం చేయడం దారుణమని తెలిపారు. ఒక ప్రముఖ రాజకీయ పార్టీగా ఇలాంటి దాడులు చేసే సంస్కృతిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ లు ప్రోత్సహించడం విచారకరమని తెలిపారు. ఈ మీడియా పై దాడిని మిగతా రాజకీయ పార్టీలు, మేధావి వర్గం అందరు తీవ్రంగా ఖండించాలని, బాధ్యులైన వారిపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# ఎన్ఐఎస్‌డీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలుగా అసోసియేట్ ప్రొఫెసర్ లలిత..!

టీపీఎన్, కడప : సీనియర్ సిటిజన్స్ విభాగంలో "జెరియాట్రిక్ కౌన్సెలింగ్" పై అడ్వాన్స్ కోర్సు మాడ్యూల్‌ను సిద్ధం చేయడానికి ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీలో సభ్యురాలుగా యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కె లలితకు చోటు లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సంస్థ వృద్ధుల కోసం మాడ్యూల్‌ను సిద్ధం చేయనుంది. అడ్వాన్స్ కోర్సు అయిన "జెరియాట్రిక్ కౌన్సెలింగ్" కోసం సమగ్ర కోర్సు పాఠ్యాంశాలు, మాడ్యూల్‌ను అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు గల స్టీరింగ్ కమిటీని నామినేట్ చేసింది. చైర్మన్‌గా ఎన్ఐఎస్‌డీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హెచ్‌సీ శ్రీధర్ చెన్నకేశవ రంగారెడ్డితో పాటు వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులతో కూడిన కమిటీలో వైవియూ నుంచి డాక్టర్ లలిత పనిచేయనున్నారు. ఇప్పటికే ఉన్న జాతీయ నైపుణ్య చట్రాలకు అనుగుణంగా కంటెంట్‌ను రూపొందించడం, తగిన అధ్యయన సామగ్రి, అభ్యాస వనరులు, అంచనా పద్ధతులను సిఫార్సు చేస్తారు. భారత ప్రభుత్వ జాతీయ సంస్థలో యోగి వేమన విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకు చోటు దక్కడం ప్రశంసనీయమని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, కుల సచివులు ఆచార్య పి పద్మ, సైకాలజీ విభాగాధిపతి డా. వి. లాజర్, సహచర అధ్యాపకులు ఆమెను అభినందించారు.





# ఆంధ్రప్రదేశ్‌లో సెక్స్ వర్క్, ట్రాఫికింగ్ సంక్షోభం..!

ఆంధ్రప్రదేశ్ ఒక నిశ్శబ్దమైన, కానీ లోతుగా పాతుకుపోయిన మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. NACO యొక్క 2024 ప్రోగ్రామాటిక్ మ్యాపింగ్ మరియు పాపులేషన్ సైజ్ ఎస్టిమేషన్ (PMPSE) ప్రకారం, రాష్ట్రంలో 1.33 లక్షల మహిళా సెక్స్ వర్కర్లు (FSWs) ఉన్నారు——ఇది భారతదేశంలోని మొత్తం సంఖ్యలో 12% వాటాను కలిగి ఉంది. సెక్స్ వర్క్ యొక్క డెన్సిటీలో రాష్ట్రం దేశంలో రెండవ స్థానంలో ఉంది, ఒక్కో హాట్‌స్పాట్‌కు సగటున 29 FSWలు ఉన్నారు, జాతీయ సగటు కేవలం 8 మాత్రమే.

ఈ ఆందోళనకర సంఖ్యల వెనుక మరింత ప్రమాదకరమైన ధోరణి ఉంది: రాష్ట్రంలో 55% కంటే ఎక్కువ సెక్స్ వర్క్ హాట్‌స్పాట్‌లు గృహఆధారితమైనవి, ఇవి ఈ వ్యాపారాన్ని అనధికారికంగా, అదృశ్యంగా, మరియు ప్రమాదకరంగా మారుస్తున్నాయి. ఈ స్థలాలు కేవలం కార్యాలయాలు మాత్రమే కాదు——ఇవి గృహాలు, ఇక్కడ పిల్లలు దోపిడీ, హింస, మరియు రెండవ తరం ట్రాఫికింగ్ యొక్క నీడలో పెరుగుతున్నారు. కృష్ణ, గుంటూరు, మరియు ప్రకాశం జిల్లాలలో, ఎన్జీవో హెల్ప్ పనిచేసే ప్రాంతాలలో, సంక్షోభం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. సుమారు 35,000 సెక్స్ వర్క్‌లో నిమగ్నమైన మహిళలు 64,000 ఆధారపడిన వారిని, వేలాది హాని కలిగిన పిల్లలతో సహా, ఆదుకుంటున్నారు. ఈ పిల్లలు నిర్లక్ష్యం, స్కూల్ డ్రాపౌట్, బాల వివాహం, మరియు తమ తల్లులు ఎదుర్కొన్న అదే దోపిడీ వ్యవస్థలలోకి ప్రవేశించే అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ అత్యవసర వాస్తవాలు ఉన్నప్పటికీ, సంస్థాగత ప్రతిస్పందన దయనీయంగా ఉంది.

**సహాయం లేని ఆశ్రయం**

2019 నుండి జూన్ 2023 వరకు, మహిళా అభివృద్ధి & బాల సంక్షేమ విభాగం (DWDCW) నివేదికల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 2,737 ట్రాఫికింగ్ బాధితులు ఆశ్రయ గృహాలలో ఉంచబడ్డారు. ఇందులో 2,265 మంది ఉజ్జ్వల హోమ్స్‌లో, 447 మంది స్వధార్ హోమ్స్‌లో, మరియు 25 మంది ఎన్జీవోనడిపే ఆశ్రయ గృహాలలో ఉన్నారు. అయినప్పటికీ, ఆశ్రయం అందుకోవడం రికవరీ లేదా న్యాయానికి హామీ ఇవ్వదు. G.O. Ms. No. 28 కింద, రక్షించబడిన బాధితులు రూ. 20,000 తక్షణ సహాయానికి అర్హులు. కానీ విముక్తి RTI పరిశోధన ప్రకారం, 2,737 మంది బాధితులలో కేవలం 132 మంది (5% కంటే తక్కువ) మాత్రమే ఈ ప్రయోజనాన్ని పొందారు——అయినా వారు రాష్ట్ర సంరక్షణలో ఉన్నారు. ఇంకా దారుణం ఏమిటంటే, బాధితులు తమ హక్కుల గురించి తెలియకుండా ఉంటారు, మరియు ఆశ్రయ సిబ్బంది వారికి సహాయ పథకాలను అందుకోవడంలో సహాయం చేయరు. విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్, బాధితులను ఆర్థికంగా పునరావాసం చేయడానికి ఉద్దేశించినది, మరింత దిగ్భ్రాంతికరమైన చిత్రాన్ని చూపిస్తుంది. 2016 నుండి 2022 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో 2890 మానవ ట్రాఫికింగ్ బాధితులు గుర్తించబడ్డారు. అయినప్పటికీ, కేవలం 5 దరఖాస్తులు మాత్రమే పరిహారం కోసం సమర్పించబడ్డాయి——అన్నీ కృష్ణ జిల్లాలోని మచిలీపట్నం నుండి. ఇంకా షాకింగ్ విషయం ఏమిటంటే, ఈ కాలంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలకు కేటాయించిన రూ. 12.14 కోట్లలో ఒక్క రూపాయి కూడా ట్రాఫికింగ్ బాధితులకు చెల్లించబడలేదు.

సంస్థాగత వైఫల్యం, ప్రత్యామ్నాయాల అవసరం

రాష్ట్రం ఆశ్రయ గృహాలపై ఆధారపడిన సంస్థాగత సంరక్షణ నమూనాలు బాధితులను పునరావాసం చేయడంలో నిరంతరం విఫలమవుతున్నాయి. 2,737 ఆశ్రయ నివాసులలో, కేవలం 692 మంది బాధితులు పునరావాసం లేదా సంక్షేమ అర్హతల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో, కేవలం 592 మంది బాధితులు సహాయం పొందారు, ఇది కేవలం 22% విజయ రేటును సూచిస్తుంది.

ఈ డేటా ఆశ్రయఆధారిత పునరావాసం యొక్క నిర్మాణాత్మక లోపాలను బహిర్గతం చేస్తుంది: పరిమిత ఔట్‌రీచ్, నీచమైన న్యాయ సహాయం, మానసిక సలహా లేకపోవడం, మరియు ముఖ్యంగా, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు సామాజిక పునరావాసంపై శూన్య దృష్టి.

అవసరమైనది సంస్థాగత సంరక్షణ నుండి కమ్యూనిటీబేస్డ్ రిహాబిలిటేషన్ (CBR) వైపు మార్పు. CBR ఒక బాధితకేంద్రీకృత నమూనాను అందిస్తుంది, ఇది గౌరవం, స్వాతంత్ర్యం, మరియు సమ్మిళితంపై ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయంగా గుర్తించబడిన మరియు జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ 2015తో సమన్వయం చేయబడిన CBR విధానాలు, ఫోస్టర్ కేర్, దత్తత, నగదు బదిలీలు, మరియు స్పాన్సర్‌షిప్‌ల వంటి సంస్థాగతం కాని సంరక్షణను ప్రాధాన్యం చేస్తాయి. ఈ నమూనాలు ఆశ్రయ వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా, విద్య, ఉపాధి, గృహనిర్మాణం, మరియు సామాజిక భద్రతకు ప్రాప్యత ద్వారా బాధితులు తమ జీవితాలను సమాజంలో పునర్నిర్మాణం చేయడానికి సహాయపడతాయి.

**తక్షణ చర్యకు సమయం**

ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కాదు; అవి సిస్టమాటిక్ అపాథీని ప్రతిబింబిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో, ట్రాఫికింగ్ నుండి రక్షించబడిన ఒక మహిళకు అత్యవసర సహాయం పొందే అవకాశం 20లో 1 కంటే తక్కువ. ఆమెకు పరిహారం లేదా దీర్ఘకాలిక పునరావాసం పొందే అవకాశం ఇంకా తక్కువ.

**ఈ గమనాన్ని మార్చడానికి, విధాన నిర్మాతలు, సివిల్ సొసైటీ, మరియు స్థానిక సమాజాలు తక్షణ సంస్కరణలను డిమాండ్ చేయాలి:**

విక్టిమ్ కాంపెన్సేషన్‌ను స్ట్రీమ్‌లైన్ చేయడం మరియు ఆశ్రయాల నుండి చురుకైన సహాయాన్ని నిర్ధారించడం.

ప్రభుత్వం మరియు గ్రాస్‌రూట్ సంస్థల మధ్య భాగస్వామ్యంతో CBR నమూనాలను విస్తరించడం.

ఆశ్రయ గృహాలను బాధిత ఫలితాల కోసం పర్యవేక్షించడం మరియు మూల్యాంకనం చేయడం, కేవలం ఆక్యుపెన్సీ కోసం కాదు. ఆశ్రయ సిబ్బంది మరియు న్యాయ సహాయ బృందాలకు బాధితుల హక్కులు మరియు అర్హతలపై శిక్షణ ఇవ్వడం.ఆంధ్రప్రదేశ్ ట్రాఫికింగ్ హాట్‌స్పాట్‌గా ఉన్న చిత్రాన్ని వదిలించుకోవాలనుకుంటే, ప్రస్తుత వ్యవస్థ యొక్క వైఫల్యాలను గుర్తించడం ద్వారా ప్రారంభించాలి——మరియు బాధితులను నిజంగా శక్తివంతం చేసే నమూనాలను అవలంబించాలి.



నిమ్మరాజు రామ్మోహన్,
హెల్ప్ ఆర్గనైజేషన్ సెక్రటరీ

# 100 ఏళ్ల సంఘర్షణ.. ఇరాన్‌ఇజ్రాయెల్ సంబంధాలు ఎలా తెగిపోయాయి..!





ఇరాన్‌ఇజ్రాయెల్ సంఘర్షణ నీడలో నడిచే మధ్యప్రాచ్యంలోని అత్యంత దీర్ఘకాలిక మరియు అస్థిరమైన ప్రత్యర్థిత్వాలలో ఒకటిగా నిలిచింది. ప్రస్తుత వార్తాశీర్షికలు ఈ రెండు దేశాల మధ్య తీవ్రమైన శత్రుత్వాన్ని చిత్రిస్తున్నప్పటికీ, లోతైన చారిత్రక విశ్లేషణ ఒక సంక్లిష్టమైన మరియు అభివృద్ధి చెందుతున్న సంబంధాన్ని వెల్లడిస్తుంది. 1979కు ముందు వ్యూహాత్మక సహకారం నుండి భావజాల వైరుధ్యం, ప్రాక్సీ యుద్ధాలు, మరియు ఇప్పుడు ప్రత్యక్ష సైనిక ఘర్షణ వరకు, ఇరాన్‌ఇజ్రాయెల్ సంబంధాల గమనం ప్రాంతీయ మరియు ప్రపంచ రాజకీయాలలో విస్తృత మార్పులను ప్రతిబింబిస్తుంది.

**1979కు ముందు వ్యూహాత్మకం కానీ బలహీనమైన కూటమి**

ఆధునిక అవగాహనకు విరుద్ధంగా, ఇరాన్ మరియు ఇజ్రాయెల్ ఒకప్పుడు వ్యూహాత్మక భాగస్వాములు. షా మహ్మద్ రెజా పహ్లావీ పాలనలో, ఇరాన్ 1950లో ఇజ్రాయెల్‌ను గుర్తించిన కొన్ని ముస్లింమెజారిటీ దేశాలలో ఒకటిగా మారింది. ఈ కూటమి, భావజాల సమన్వయం కాకుండా, ఉమ్మడి భౌగోళిక రాజకీయ ప్రయోజనాల ద్వారా నడిచింది, శీతల యుద్ధ సమయంలో వృద్ధి చెందింది. ఈ రెండు దేశాలు ఈజిప్టు గమాల్ అబ్దుల్ నాసర్ నాయకత్వంలో అరబ్ జాతీయవాదం యొక్క ఉద్భవాన్ని వ్యతిరేకించాయి. ఇరాన్ ఇజ్రాయెల్‌కు నిషేధ సమయంలో చమురు సరఫరా చేసింది, అలాగే రెండు దేశాలు గూఢచర్యం మరియు సైనిక సహకారంలో, టర్కీతో "ట్రైడెంట్" కూటమితో సహా, పాల్గొన్నాయి. ఈ కాలం, ఉమ్మడి బెదిరింపులు మరియు వ్యవహారిక రాజకీయాలు సాంస్కృతిక మరియు మతపరమైన విభజనలను దాటవచ్చని చూపించింది. అయితే, ఈ కూటమి షా పాలనపై ఎక్కువగా ఆధారపడింది——1979లో స్పష్టమైన ఒక బలహీనత.

**1979 ఇస్లామిక్ విప్లవం ఒక మలుపు**

ఇస్లామిక్ విప్లవం ఇరాన్ యొక్క దేశీయ మరియు విదేశీ విధానాన్ని పునర్నిర్మించింది. షాను పడగొట్టడం మరియు అయాతొల్లా రుహొల్లా ఖొమైనీ ఉద్భవం ఇజ్రాయెల్‌తో సంబంధాలను ముగించింది. ఖొమైనీ యొక్క జియోనిస్ట్ వ్యతిరేక వైఖరి ఇజ్రాయెల్‌ను పాశ్చాత్య సామ్రాజ్యవాదం మరియు అక్రమత్వం యొక్క చిహ్నంగా చిత్రించింది. ఇజ్రాయెల్‌ను కాన్సర్ ట్యూమర్ అని పిలిచి, ఇరాన్ ఒక ఘర్షణాత్మక వైఖరిని అవలంబించింది, పాలస్తీనా ప్రతిఘటనకు మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేసి, టెల్ అవీవ్‌తో అన్ని దౌత్య సంబంధాలను తెంచుకుంది. ఈ విప్లవం ఇరాన్‌ను ఒక విప్లవాత్మక ఇస్లామిక్ రాష్ట్రంగా గుర్తించింది, ఇది ఇజ్రాయెల్‌తో ఘర్షణ మార్గంలో నడిచింది, దాని భద్రతా విధానాలు జీవన బెదిరింపులను తటస్థీకరించడంపై ఆధారపడ్డాయి. ఈ భావజాల విచ్ఛిన్నం రెండు రాష్ట్రాల మధ్య లోతైన మరియు దీర్ఘకక విభజనను సృష్టించింది.

ప్రాక్సీ యుద్ధం: ప్రాంతీయ ప్రభావంతో పరోక్ష సంఘర్షణ

ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనడం కాకుండా, ఇరాన్ మరియు ఇజ్రాయెల్ దీర్ఘకాలిక ప్రాక్సీ సంఘర్షణ దశలోకి ప్రవేశించాయి. ఇరాన్ లెబనాన్‌లో హెజ్బొల్లా, గాజాలో హమాస్, ఇరాక్ మరియు సిరియాలో షియా మిలీషియాలతో సహా రాష్ట్రేతర కారకాల నెట్‌వర్క్‌ను నిర్మించింది, ఇవి ప్రభావాన్ని ప్రసరించడానికి మరియు ఇజ్రాయెల్‌ను ప్రత్యక్ష ఘర్షణ లేకుండా హింసించడానికి ఉపయోగించాయి. 2006 లెబనాన్ యుద్ధంలో హెజ్బొల్లా పాత్ర ఈ విధానాన్ని ఉదాహరణగా చూపింది. దాని వైపు, ఇజ్రాయెల్ ముందస్తు వ్యూహాలు మరియు రహస్య కార్యకలాపాలను ఉపయోగించింది, ఉదాహరణకు 2010లో ఇరాన్ యొక్క అణు సౌకర్యాలపై స్టక్స్‌నెట్ సైబర్ దాడి మరియు 2020లో అణు శాస్త్రవేత్త మొహ్సెన్ ఫఖ్రిజాదెహ్ హత్య. ఈ నీడ యుద్ధం రెండు దేశాలకు స్థిరమైన ప్రచారాన్ని నడిపించడానికి అనుమతించింది, ఇది ఇటీవల వరకు పూర్తి యుద్ధాన్ని నివారించింది.

**2020లో బహిరంగ సంఘర్షణకు ఉద్ధృతి**

2020లలో వ్యూహాత్మక గణన గణనీయంగా మారింది. 2024 ఏప్రిల్‌లో, ఇరాన్ ఇజ్రాయెల్‌పై భారీ డ్రోన్ మరియు క్షిపణి దాడిని ప్రారంభించింది——1979 తర్వాత మొదటి ప్రత్యక్ష దాడి——ఇజ్రాయెల్ దాని డమాస్కస్ కాన్సులేట్‌పై దాడి చేయడం దీనికి కారణం. ఇజ్రాయెల్ దీనికి బలంగా స్పందించింది, జూన్ 2025లో “ఆపరేషన్ రైజింగ్ లయన్”లో ఇరాన్ సైనిక మరియు అణు స్థలాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ కొత్త బహిరంగ ఘర్షణ దశ, దశాబ్దాల ప్రాక్సీ వ్యూహం నుండి ఒక విచలనాన్ని సూచిస్తుంది, ఇది ప్రాంతీయ ఉద్ధృతి యొక్క ప్రమాదాన్ని పెంచుతుంది.

**ముగింపు: చరిత్రలో ఊనిక ఉన్న సంఘర్షణ**

ఇరాన్‌ఇజ్రాయెల్ ప్రత్యర్థిత్వం కేవలం భావజాలం లేదా మతం యొక్క ఉత్పత్తి కాదు——ఇది మారుతున్న కూటములు, ప్రాంతీయ ఆశయాలు మరియు ప్రపంచ శక్తి గతిశీలతల ద్వారా రూపొందిన చారిత్రక కథనం. సహచరుల నుండి ప్రత్యర్థులకు, ఈ సంబంధం మధ్యప్రాచ్య భవిష్యత్తు కోసం విస్తృత పోరాటాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవడం విధాన రూపకర్తలకు మాత్రమే కాక, ఈ ఎప్పటికీ లోతవుతున్న సంఘర్షణ యొక్క ప్రమాదాలను అర్థం చేసుకోవాలనుకునే అందరికీ కీలకం.



# ఇరాన్ సాయం అంతా ఫేక్

రాన్ పౌర అణు కార్యక్రమానికి మద్దతుగా అమెరికా దాదాపు 30 బిలియన్ డాలర్ల అంటే మన ఇండియన్ కరెన్సీలో దాదాపు రూ.2.5 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమైందంటూ అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇందులో ఎలాంటి నిజం లేదని, అవన్నీ నిరాధారమైనవని ఆయన కొట్టిపారేశారు. ఇదంతా 'ఫేక్ న్యూస్ మీడియా' సృష్టిస్తున్న కల్పిత కథనమని ఆయన మండిపడ్డారు. ఇరాన్‌తో కొత్త దౌత్య ఒప్పందం కోసం ట్రంప్ కార్యవర్గం ప్రయత్నిస్తోందని ఆ కథనంలో పేర్కొన్నారు. దీని ప్రకారం పశ్చిమాసియాలోని ఇరాన్‌కు చెందిన మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడులు జరిపిన తర్వాత, శ్వేతసౌధంలో కీలక సమావేశం జరిగినట్లు తెలిసింది. ఈ భేటీలో ట్రంప్ పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో పాటు పలు గల్ఫ్ దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారని కథనం వివరించింది.



## అహ్మదాబాద్ క్రాష్ దర్యాప్తు అధికారికి
# భద్రత పెంపు

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ఎయిరిండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న అధికారికి కేంద్ర ప్రభుత్వం భద్రతను పెంచింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏవియేషన్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్‌కు 'ఎక్స్' కేటగిరీ భద్రతను కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయనకు ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం ప్రకారం, యుగంధర్‌కు ముప్పు పొంచి ఉందని నిఘా సంస్థలు అంచనా వేశాయి. జూన్ 16 నుంచే ఆయనకు సీఆర్పీఎఫ్ కమాండోలతో రక్షణ కల్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ విమాన ప్రమాద దర్యాప్తు అత్యంత కీలక దశలో ఉండగా, దర్యాప్తు బృందానికి నేతృత్వం వహిస్తున్న అధికారికి భద్రత పెంచడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## అదే జరిగితే నితీష్ కుమార్ ఔట్..!

టీపీఎన్, బీహార్ : జన్ సూరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే నితీష్ కుమార్ ను తప్పించి కాషాయం పార్టీకి చెందిన వ్యక్తినే సీఎంగా ప్రకటిస్తారని బాంబ్ పేల్చారు. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు ముమ్మరం అయ్యాయి. తేజస్వి యాదవ్ నుండి నితీష్ కుమార్ వరకు అందరినీ టార్గెట్‌గా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా తీర్పు ఈసారి కొత్తగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు పీకే.

# రక్షణ బడ్జెట్‌ను పెంచుకుంటున్న దేశాలు..!

**టీపీఎన్ ప్రతినిధి :**







అమెరికాయూరప్ నుంచి చైనాబ్రిటన్ వరకు.. ప్రతి ఒక్క దేశం తమ రక్షణ బడ్జెట్‌ను పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రపంచంలో సైనిక వ్యయం వేగంగా పెరుగుతోంది. ఇది 2024 నాటికి 2.7 ట్రిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు నిపుణులు. ఇది 2015 కంటే 37% ఎక్కువ. నాటో దేశాలు రక్షణ బడ్జెట్లను పెంచాలని యోచిస్తున్నాయి. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఒత్తిడిని పెంచుతుంది. ఇది ఆయుధ పోటీకి దారితీయడంతో పాటు ఆరోగ్యం, విద్య, ప్రాథమిక సేవలను కూడా ప్రభావితం చేస్తుంది.ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆరోగ్య సంరక్షణ, విద్య ,మౌలిక సదుపాయాల బడ్జెట్‌లను ప్రభావితం చేస్తుంది.

2024 లో ప్రపంచ సైనిక వ్యయంలో అమెరికా మాత్రమే దాదాపు 37 శాతం వాటాను కలిగి ఉంటుంది. చైనా 12 శాతంతో రెండో స్థానంలో ఉండగా, EU 27, UK సంయుక్తంగా 17 శాతంతో మూడవ స్థానంలో ఉన్నాయి. ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత రష్యా ఆరు శాతానికి చేరుకోగా, భారతదేశం తన బడ్జెట్‌లో మూడు శాతం రక్షణ కోసం ఖర్చు చేస్తుంది.

ప్రపంచంలోని మిగిలిన దేశాల వాటా 1994లో దాదాపు 22 శాతం నుంచి 2024లో 25 శాతానికి తగ్గింది. అయితే మొత్తం సైనిక వ్యయం పెరిగింది. కొన్ని దేశాల నేతృత్వంలో 2024లో ప్రపంచ సైనిక వ్యయం పెరిగింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ వాటా 27 శాతం, బ్రిటన్ వాటా మొత్తం వాటా 54 శాతం, వీటిలో ప్రధానమైనది నాటో. జూన్ 25న కుదిరిన ఇటీవలి ఒప్పందంలో దాని రక్షణ బడ్జెట్‌ను పెంచాలని యోచిస్తోంది. 2035 నాటికి రక్షణ కోసం తన GDPలో 3.5 శాతం, భద్రత కోసం 1.5 శాతం ఖర్చు చేయాలని NATO యోచిస్తోంది. ఇది ఏటా 800 బిలియన్ల పెరుగుదలను సూచిస్తుంది. 2023లో ఇజ్రాయెల్ తన జిడిపిలో 9 శాతం రక్షణ కోసం ఖర్చు చేస్తుంది. ఇది అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో అత్యధికం. జపాన్ కూడా తన రక్షణ బడ్జెట్‌ను పెంచుతోంది. 2014 నుంచి అమెరికా దాని మిత్రదేశాలు ప్రపంచ సైనిక వ్యయంలో తమ వాటాను విస్తరించాయి. ఇక చైనా వాటా 12 శాతానికి పైగా ఉంది, భారతదేశం యొక్క వృద్ధి స్థిరంగా ఉంది. పెరుగుతున్న భద్రతా అవసరాలు ఉన్నప్పటికీ, ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలు గ్లోబల్ సౌత్‌లో ఎక్కువ భాగం సహా ఒత్తిడిలో ఉన్నాయి. ఇటీవల సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా సాయుధ పోరాటాలు , భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. వరుసగా రెండవ సంవత్సరం, ప్రపంచంలోని ఐదు భౌగోళిక ప్రాంతాలలో సైనిక వ్యయం పెరిగింది. ఇది ప్రపంచవ్యాప్తంగా పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తుంది.

ప్రపంచ వ్యయంలో దశాబ్ద కాలంగా పెరుగుదలకు యూరప్‌లో ఖర్చు పెరుగుదల పాక్షికంగా కారణమని చెప్పవచ్చు. ప్రధానంగా కొనసాగుతున్న రష్యాఉక్రెయిన్ యుద్ధం , మధ్యప్రాచ్యంలో గాజా, లెబనాన్, సిరియా .. ఇటీవల ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధాలు దీనికి కారణమని చెప్పవచ్చు.అనేక దేశాలు సైనిక వ్యయాన్ని పెంచడానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ వృద్ధిని మరింత పెంచుతుంది. సైనిక పెరుగుదల స్వల్పకాలంలో పారిశ్రామిక కార్యకలాపాలను పెంచవచ్చు. కానీ ఇది దీర్ఘకాలిక ఆర్థిక ఒత్తిడిని కూడా కలిగిస్తుంది.






# RAW కొత్త చీఫ్‌గా పరాగ్ జైన్..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (RAW) కొత్త చీఫ్‌గా పరాగ్ జైన్ నియమితులయ్యారు. 1989 బ్యాచ్ పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన జైన్, జూలై 1, 2025 నుంచి రెండేళ్ల కాలపరిమితితో ఈ పదవిని చేపట్టనున్నారు. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీ కాలం జూన్ 30తో ముగియనుంది.పరాగ్ జైన్ ప్రస్తుతం ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇందులో పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (PoK)లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన గూఢచార సమాచారం సేకరించడంలో ఆయన యూనిట్ విజయవంతమైంది. ఈ సమాచారం ఖచ్చితమైన క్షిపణి దాడులకు దోహదపడింది.జైన్ తన కెరీర్‌లో పంజాబ్‌లో ఉగ్రవాద రోజుల్లో భటిండా, మాన్సా, హోషియార్‌పూర్‌లలో సేవలందించారు. చండీగఢ్‌లో ఎస్ఎస్‌పీ, లూధియానాలో డీఐజీగా కీలక పదవులు నిర్వహించారు. కెనడా, శ్రీలంకలో భారత ప్రతినిధిగా పనిచేసిన ఆయన, కెనడాలో ఖలిస్తాన్ సమర్థక నెట్‌వర్క్‌ను బయటపెట్టడంలో, దాని ప్రమాదకర స్వభావం గురించి ఢిల్లీకి హెచ్చరికలు జారీ చేయడంలో ముఖ్య పాత్ర పోషించారు.

జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ఆపరేషన్ బాలాకోట్ సమయంలోనూ జైన్ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హ్యూమన్ మరియు టెక్నికల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థవంతంగా సమన్వయం చేసిన సూపర్ గూఢచారిగా ఆయనకు ఇంటెలిజెన్స్ వర్గాల్లో గొప్ప పేరుంది. పంజాబ్‌లో ఉగ్రవాదాన్ని అణచివేయడంలో కఠిన చర్యలు తీసుకున్న జైన్, ఆపరేషన్ సిందూర్‌లో తన నాయకత్వంతో గణనీయ విజయం సాధించారు.2021 జనవరి 1న పంజాబ్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ర్యాంక్‌కు పదోన్నతి పొందిన జైన.. వివేకవంతమైన, నిజాయితీపరుడైన అధికారిగా సీనియర్ అధికారుల ప్రశంసలు అందుకున్నారు. జూన్ 28న కేబినెట్ నియామకాల కమిటీ ఆయన నియామకాన్ని ఆమోదించింది. ఇది భారత భద్రతా వ్యవస్థలో కీలక సమయంలో జరిగిన నిర్ణయం.



## వలసదారులకు అమెరికా వార్నింగ్

అమెరికాలో నివసిస్తున్న వలసదారులకు ముఖ్యంగా గ్రీన్‌కార్డు హోల్డర్లకు ఆ దేశ పౌరసత్వ, ఇమిగ్రేషన్ సేవల విభాగం హెచ్చరికలు జారీ చేసింది. దేశ చట్టాలను, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చింది. వారి గ్రీన్‌కార్డులు, వీసాలు రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు యూఎస్‌సీఐఎస్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా చట్టాలను ఉల్లంఘించడం, ముఖ్యంగా ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం లేదా హింసను ప్రోత్సహించడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడితే, వారి శాశ్వత నివాస హోదాను తక్షణమే రద్దు చేస్తామని తేల్చిచెప్పింది. గ్రీన్‌కార్డు ద్వారా అమెరికాలో శాశ్వత నివాసం పొందడం అనేది ఒక హక్కు కాదని, అది కేవలం ప్రభుత్వం కల్పించే షరతులతో కూడిన సౌలభ్యం మాత్రమేనని యూఎస్‌సీఐఎస్ తన ప్రకటనలో పేర్కొంది.

## మళ్లీ పెళ్లాడిన జెఫ్ బెజోస్..
# లారెన్ శాంచెజ్‌తో ఇటలీలో వివాహం..!



**టీపీఎన్, ఇటలీ :**

అమెజాన్ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన జెఫ్ బెజోస్ తన ప్రియురాలు, జర్నలిస్ట్ లారెన్ శాంచెజ్‌ను ఇటలీలోని వెనిస్ నగరంలోని శాన్ జార్జియో మాజియోరే ద్వీపంలో వివాహమాడారు. జూన్ 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ ఆడంబర వేడుకలకు కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా, ఆమె భర్త జారెడ్ కుష్నెర్, ప్రముఖ జర్నలిస్ట్ ఓప్రా విన్‌ఫ్రే, కిమ్ కర్దాషియన్, కోలే కర్దాషియన్, జోర్డాన్ రాణి రనియా తదితరులు ఈ వేడుకలకు విచ్చేశారు.పెళ్లి తర్వాత లారెన్ శాంచెజ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను 'Lauren S□nchez Bezos'గా మార్చి, తమ తొలి దాంపత్య ఫొటోను షేర్ చేశారు. ఫొటోలో లారెన్ తెల్లని లేస్ గౌన్‌లో చిరునవ్వుతో మెరిసిపోగా, బెజోస్ నలుపు టక్సీడోలో అలరించారు. ఈ ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది.అయితే, ఈ వేడుకలను వ్యతిరేకిస్తూ వెనిస్ స్థానికులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. 'No Kings, No Bezos' అనే నినాదం సెయింట్ మార్క్ టవర్‌పై ప్రదర్శించగా, 'Tax Billionaires' ప్లకార్డులు నగర వీధుల్లో కనిపించాయి. సెలబ్రిటీల రాకపోకలు నగర రవాణాను స్తంభింపజేస్తాయని, బిలియనీర్ల ప్రైవేట్ జెట్లు, యాచ్‌ల వల్ల కార్బన్ ఉద్గారాలు పెరుగుతున్నాయని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, ఈ పెళ్లి వేడుక వల్ల వెనిస్‌కు భారీ ఆర్థిక లాభం లభిస్తోందని ఇటలీ టూరిజం శాఖ పేర్కొంది. మీడియా ప్రచారం ద్వారా సుమారు 895 మిలియన్ యూరోల వ్యాపార విలువ లభిస్తుందని అంచనా వేసింది. జెఫ్ బెజోస్ నగరానికి 3 మిలియన్ యూరోల విరాళం ప్రకటించారు. స్థానిక కళాకారులు తయారు చేసిన గిఫ్ట్ బాగ్స్, మురానో గాజు వస్తువులు, 19వ శతాబ్దపు బిస్కెట్లు వేడుకలను మరింత విశిష్టంగా మార్చాయి. ఈ వివాహం వెనిస్‌లో జార్జ్ క్లోనీ తరహా స్టార్ పెళ్లిగా చరిత్రలో నిలిచిపోనుంది.జెఫ్ బెజోస్, లారెన్ శాంచెజ్ 2018 నుంచి సంబంధంలో ఉన్నారు. 2019లో ఈ విషయం బయటకు వచ్చింది. అదే ఏడాది బెజోస్ తన భార్య మెకంజీ స్కాట్‌తో 25 ఏళ్ల వైవాహిక బంధానికి విడాకులు తీసుకున్నారు. వీరికి నలుగురు సంతానం ఉన్నారు. 2023లో బెజోస్, లారెన్ నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు 2.5 మిలియన్ డాలర్ల వజ్రాల ఉంగరం బహూకరించినట్లు వార్తలు వైరల్ అయ్యాయి.

# "జీనస్ పవర్: అద్భుతమైన వృద్ధి, స్మార్ట్ మీటర్ కీలక ప్లేయర్, ₹30,000 కోట్ల ఆర్డర్ బుక్ నిర్మాణంలో ఒక పవర్‌హౌస్"

ఈ వారం మనం విద్యుత్ మీటరింగ్ సొల్యూషన్స్ పరిశ్రమలో ముఖ్యమైన కంపెనీ జీనస్ పవర్ గురించి తెలుసుకుందాం. స్మార్ట్ మీటర్లు కచ్చితమైన, ప్రత్యక్ష వినియోగ డేటాను అందించే డిజిటల్ పరికరాలు. నేడు మనం జీవిస్తున్న ప్రపంచంలో సాంకేతికత మన జీవితంలోని ప్రతి అంశాన్ని తాకుతుంది. సౌరశక్తి, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ వాహనాలు మొదలైనవి ఈ కోవకే వస్తాయి. స్మార్ట్ మీటర్ రంగంలో అగ్రగామి అయిన జీనస్ పవర్ 27% వాటాతో స్మార్ట్ మీటర్ రంగంలో బలమైన కంపెనీగా స్థిరపడింది.

**బేసిక్ డేటా:**

**మార్కెట్ క్యాప్: రూ.11356 కోట్లు.**
**మూలధనం రూ.27.63 కోట్లు**
**ఫేస్ వాల్యూ రూ.1**
**27-06-2025న MP - రూ.373.70**
**52 వారాల గరిష్ఠం రూ.485**
**PE - 33**
**సెక్టార్ PE - 81**

**తాజా ఆర్థికం:**

**31-03-24 నుంచి 31-03-25 (కోట్లలో రూపాయలు)**
**రాబడి/అమ్మకాలు 1200 2442**
**నికర లాభం 87 311**
**EPS (రూపాయలలో) 3.61 11.27**
**ఈక్విటీపై రాబడి (%లో) 5.51 16.67**

ఆదాయం రెట్టింపు కంటే ఎక్కువ. నికర లాభం మూడు రెట్లు ఎక్కువ పెరిగింది. EPS 2 రెట్లు ఎక్కువ పెరిగింది. ఈక్విటీపై రాబడి 16.67% బెంచ్‌మార్క్ 7% కంటే చాలా ఎక్కువ. బెంచ్‌మార్క్ అంటే బ్యాంక్ డిపాజిట్‌పై వడ్డీ 7%. ఏ ప్రమాణం ప్రకారం చూసినా ఇది అద్భుతమైన వృద్ధి.

**కంపెనీ భవిష్యత్తు:**

1. మార్చి, 2026 నాటికి 250 మిలియన్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం దృఢచిత్తంతో ఉంది. కానీ ఏప్రిల్, 2025 వరకు కేవలం 2.50 మిలియన్ల స్మార్ట్ మీటర్లను మాత్రమే ఏర్పాటు చేశారు. భర్తీ చేయాల్సిన భారీ అంతరం ఉంది. ఇది కంపెనీ వృద్ధికి అవకాశం కల్పిస్తోంది.
2. ప్రస్తుతం వ్యాపారంలో ఎక్కువ భాగం బీహార్ మరియు అస్సాం రాష్ట్రాలకే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తే చాలా రాష్ట్రాలు స్మార్ట్ మీటర్ల స్కీమ్‌ను అమలు చేసే అవకాశముంది. ఎక్కువ ప్రయోజనాలు ఉండటంతో స్మార్ట్ మీటర్ రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయి.
3. కంపెనీ రూ.30000 కోట్ల ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది. ఇది రాబోయే సంవత్సరాలకు వ్యాపారానికి ధీమానిస్తోంది.
4. సింగపూర్‌కు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ అయిన GIC ఈ కంపెనీలో 15% వాటాను తీసుకుంది ఇది స్మాట్ మీటరింగ్ స్పేస్ అవకాశాలను సూచిస్తుంది.

**ప్రమాదాలు:**

1. గత రెండు సంవత్సరాలుగా కంపెనీకి ఆపరేటింగ్ క్యాష్‌ఫ్లో ప్రతికూలంగా ఉంది. ఇది రాబడుల విషయంలో సమస్యను సూచిస్తుంది.
2. రుణ ఈక్విటీ నిష్పత్తి 0.73 వద్ద ఎక్కువగా ఉంది. ఇది కాస్త ఆందోళన కలిగించే విషయం.
3. వాటాల తాకట్టు విషయంలో స్పష్టత లేదు.

**ఫైనల్ వర్డ్స్ :**

ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ షేర్లకు రూ.450 లక్ష్యాన్ని ఇచ్చింది.

**పాలేటి హరి ప్రసాద్**
**స్టాక్ మార్కెట్ విశ్లేషకుడు**
**+91 8179656259**




## ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌లో రిలయన్స్ భారీ పెట్టుబడులు..!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌గా ఏర్పడనుంది. దీంతో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశం చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ మధ్యలో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాక అన్నిరకాలుగా సహాయ, సహకారాలు అందిస్తుంది.

కాగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రీయల్ కారిడార్ పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా 9 వేల 718 ఎకరాలు సేకరించి ఓర్వకల్లు మెగా ఇండస్ట్రీయల్ హబ్‌ను ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఇప్పటికే జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్ కంపెనీ 413.19 ఎకరాల్లో రూ.2938 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వీటితో పాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 300 ఎకరాలలో డ్రోన్ కార్పొరేషన్, 1002.36 ఎకరాలలో పీపుల్ టెక్ కంపెనీ ద్వారా సెమీ కండక్టర్, బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది.

## బిల్‌గేట్స్ ఫౌండేషన్‌కు బఫెట్ భారీ విరాళం..!



ప్రపంచ కుబేరుల్లో ఒకరైన వారెన్ బఫెట్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తనను మించిన దాత మరొకరు లేరని నిరూపించుకున్న ఆయన, తాజాగా మరోసారి భారీ విరాళాన్ని అందించారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ నిర్వహిస్తున్న గేట్స్ ఫౌండేషన్‌కు వేల కోట్ల రూపాయల సాయాన్ని అందజేశారు. బఫెట్ ఇప్పటివరకు అందించిన విరాళాల్లో ఇది అతిపెద్ద వార్షిక విరాళంగా నిలిచింది. గేట్స్ ఫౌండేషన్‌తో పాటు మరో నాలుగు కుటుంబ ఛారిటీ సంస్థలకు వారెన్ బఫెట్ 6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.50 వేల కోట్లు) విలువైన బెర్క్‌షైర్ హాత్‌వే షేర్లను విరాళంగా అందించారు. ఈ తాజా విరాళంలో గేట్స్ ఫౌండేషన్‌కు 9.43 మిలియన్ షేర్లు, సుసాన్ థాంప్సన్ బఫెట్ ఫౌండేషన్‌కు 9.4 లక్షల షేర్లు, బఫెట్ పిల్లలు హోవార్డ్, సూసీ, పీటర్ నిర్వహిస్తున్న మూడు ఛారిటీ సంస్థలకు మొత్తంగా 6.6 లక్షల షేర్లు కేటాయించారు. గత రెండు దశాబ్దాలుగా బఫెట్ ఇలాంటి భారీ విరాళాలను అందిస్తూనే ఉన్నారు. బెర్క్‌షైర్ హాత్‌వే అనేది వారెన్ బఫెట్‌కు చెందిన పెట్టుబడి సంస్థ. తాజాగా 6 బిలియన్ డాలర్ల షేర్లను విరాళంగా ఇచ్చినప్పటికీ, ఈ సంస్థలో బఫెట్ వాటా ఇంకా 13.8 శాతం ఉంది. ఈ విరాళానికి ముందు బఫెట్ నికర సంపద 152 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఈ విరాళం తర్వాత ఆయన సంపద తగ్గడంతో ప్రపంచ కుబేరుల జాబితాలో ఆయన ఐదో స్థానం నుంచి ఆరో స్థానానికి చేరుకుంటారు. ప్రస్తుతం 94 ఏళ్ల వయస్సులో ఉన్న బఫెట్ 2006 నుంచి విరాళాలను అందిస్తున్నారు.




## అమ్మకాల్లో స్కోడా జోరు

అమ్మకాల్లో దూసుకుపోతోంది స్కోడా చిన్నకారు. భారత ఆటోమొబైల్ మార్కెట్లో అత్యంత పోటీ ఉండే కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో స్కోడా ఆటో ఇండియా తనదైన ముద్ర వేస్తోంది. 2021 జూన్ 28న మార్కెట్లోకి అడుగుపెట్టిన స్కోడా కుషాక్, విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ నాలుగేళ్ల కాలంలో కంపెనీ ఏకంగా 89,000 కుషాక్ యూనిట్లను విక్రయించి కీలక మైలురాయిని చేరుకుంది. స్కోడా తన 'ఇండియా 2.0' వ్యూహంలో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తొలి ఉత్పత్తి కుషాక్. ఈ కారు అంచనాలకు మించి రాణించి కంపెనీకి పెద్ద విజయాన్ని అందించింది. సగటున ప్రతినెలా 1,854 కుషాక్ కార్లు అమ్ముడయ్యాయి.



## ఈ సేవింగ్స్ స్కీమ్స్‌పై వడ్డీ రేట్ల తగ్గింపు..!

కేంద్ర ప్రభుత్వం 2025 జూన్ 30 నాటికి సుకన్య సమృద్ధి యోజన (SSY)సహా అన్ని స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ వడ్డీ రేట్లను మార్చే అవకాశం ఉంది. కొత్త రేట్లు 2025 జులై 1 నుంచి 2025 సెప్టెంబర్ 30 వరకు వర్తిస్తాయి. ప్రస్తుతం 8.2%గా ఉన్న సుకన్య సమృద్ధి యోజన వడ్డీ రేటును తగ్గించే అవకాశం ఉంది.

**రేటు తగ్గింపు ఎందుకు?**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) 2025 ఫిబ్రవరి నుంచి రెపో రేటును 1% తగ్గించింది. ఫలితంగా చాలా బ్యాంకులు ఫిక్సడ్ డిపాజిట్లు, సేవింగ్స్ అకౌంట్‌లపై వడ్డీ రేట్లను తగ్గించాయి. ఈ ట్రెండ్ సుకన్య సమృద్ధి యోజన (Sukanya Samriddhi Yojana) వంటి స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ వడ్డీ రేట్లను మార్చేలా ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తుంది. జూన్ 30న తుది నిర్ణయం తీసుకోనుండగా, నిపుణులు SSY వడ్డీ రేటులో స్వల్ప తగ్గింపు ఉండొచ్చని చెబుతున్నారు.



## బంగారం ఈటీఎఫ్‌ల్లో యూలిప్స్ పెట్టుబడులు..!

పసిడి ధరల ఊపు జీవిత బీమా సంస్థలను బాగా ఆకర్షిస్తోంది. గత 25 ఏళ్లలో బంగారం ధర ఏకంగా 20 రెట్లు పెరిగింది. గత ఏడాది కాలంలో బంగారం ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో మదుపరులు సగటున 30 శాతం రాబడిని సాధించారు. దీంతో, తమ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాల (యూలిప్స్) పెట్టుబడుల్లో కనీసం 3 నుంచి 5 శాతం గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించాలని బీమా సంస్థలు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ)ని కోరాయి.

ఎందుకు?

ప్రస్తుతం బీమా కంపెనీలకు నేరుగా బంగారంలో లేదా గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడి చేసేందుకు అనుమతి లేదు. యూలిప్స్ ద్వారా సేకరించిన నిధులను ఈ సంస్థలు ఈక్విటీ, రుణ పత్రాలు, లిక్విడ్ డెట్ ఫండ్స్, లేదా బ్యాంకు ఫిక్సడ్ డిపాజిట్లలో మాత్రమే పెట్టుబడులుగా పెడుతున్నాయి. గత ఏడాదిలో ఈ పెట్టుబడులపై సగటున 5 నుంచి 8 శాతం రాబడి మాత్రమే వచ్చింది. అదే సమయంలో, బులియన్ మార్కెట్ సగటున 30 శాతం రాబడిని అందించింది. ఈ నేపథ్యంలో, పెట్టుబడుల వివిధీకరణ (డైవర్సిఫికేషన్) కోసమైనా గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులను అనుమతించాలని బీమా కంపెనీలు ఐఆర్‌డీఏఐని కోరుతున్నాయి. త్వరలోనే ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి నిర్ణయం తీసుకుంటుందని అంచనా వేస్తున్నారు.








# ఫస్ట్ టీ20లో టీమిండియా భారీ విజయం

ఐదు టీ20ల సిరీస్ లో భారత మహిళల జట్టు అదిరిపోయే విన్నింగ్ మూమెంట్ ఇచ్చింది. ట్రెంట్ బ్రిడ్జిలో ఇంగ్లండ్‌ను వణికిస్తూ విజయం సాధించింది. స్మృతి మంధాన 112 పరుగులతో సూపర్ సెంచరీతో స్కోర్ కొట్టిన టీమిండియా.. తర్వాత ప్రత్యర్థిని 113కే లాక్ చేసి 97 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. స్పిన్నర్ శ్రీ చరణి విజృంభణతో ఆతిథ్య జట్టు బ్యాటర్లు చేతులెత్తేశారు. అర్ధ శతకంతో పోరాడిన నాట్ సీవర్ బ్రంట్ ఔటైన కాసేపటికే ఇంగ్లండ్ కుప్పకూలింది. దాంతో, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టీమిండియా ఫిక్స్ చేసిన భారీ లక్ష్యానికి ఇంగ్లండ్ ఫస్ట్ నుంచి తడబడింది. పవర్ ప్లేలోనే రెండు వికెట్లు కోల్పోయిన జట్టును కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ ఆదుకుంది. సహచరులు విఫలం అయినా ఆమె దూకుడుగా ఆడి అర్ధ శతకం సాధించింది. కానీ, భారత బౌలర్లు వికెట్ల వేట కొనసాగించగా.. వచ్చినవాళ్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు. 15వ ఓవర్ తొలి బంతికే నాట్ సీవర్‌ను శ్రీ చరణి ఔట్ చేసింది. అదే ఓవర్లో లారెన్ బెల్‌ను చరణి ఔట్ చేయడంతో భారత జట్టు 97 పరుగుల తేడాతో గెలుపొందింది. ఐదు టీ20ల సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లోనే భారత మహిళల జట్టు భారీ స్కోర్ చేసింది. నాటింగ్‌హమ్‌లోని ట్రెంట్‌బ్రిడ్జ్ మైదానంలో కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగింది. ఈ ఫార్మాట్‌లో తొలి శతకంతో ఆమె గర్జించగా.. హర్లీన్ డియోల్ మెరుపు బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఈ ఇద్దరి విధ్వంసంతో టీమిండియా పొట్టి క్రికెట్‌లో టీమిండియా రెండో అత్యధిక స్కోర్ కొట్టింది. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 రన్స్ చేసిన మంధాన టీమ్ ప్రత్యర్థి ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. ఇదే వీరికి ప్లస్‌గా మారింది.

# నాదే తప్పు.. పూర్తి బాధ్యత తీసుకుంటా: ప్రసిద్ధ్ కృష్ణ

ఇంగ్లాండ్ తో జరిగిన ఫస్ట్ టెస్టులో భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వికెట్లు తీసినా ఈజీగా పరుగులు ఇచ్చేశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 220 రన్స్ ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో ప్రసిద్ధ్ ఇటు అభిమానుల నుంచి, అటు మాజీ క్రికెటర్ల నుంచి విమర్శలు ఎదుర్కొన్నాడు. తాజాగా తన ప్రదర్శన గురించి ప్రసిద్ధ్ మాట్లాడాడు. తాను బాగా బౌలింగ్ చేయలేదని ఒప్పుకున్నాడు. లోపాలను సరిదిద్దుకుని భవిష్యత్‌లో మంచి ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తానని పేర్కొన్నాడు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. మొదటి ఇన్నింగ్స్‌లో నేను కోరుకున్న విధంగా బౌలింగ్ చేయలేదు. సెకండ్ ఇన్నింగ్స్ వచ్చేసరికి పిచ్ నెమ్మదించడంతో నా బౌలింగ్ కాస్త మెరుగైంది. కచ్చితంగా నేను అనుకున్న విధంగా సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయలేకపోయా. పిచ్‌ను అర్థం చేసుకోవడానికి కొంచెం సమయం తీసుకున్నా. ఒక ప్రొఫెషనల్‌గా నా లోపాలను అధిగమించగలను. ఈ విషయంలో పూర్తి బాధ్యత తీసుకుంటాను. నెక్స్ట్ టైమ్ బాగా బౌలింగ్ చేయడానికి ప్రయత్నిస్తా. ప్రతి ఓవర్‌నూ మెయిడిన్ చేయాలనుకుంటా. బౌండరీలు ఇవ్వడానికి ప్రయత్నించడం లేదు. ఔట్‌ఫీల్డ్ వేగంగా ఉంది. నిజం చెప్పాలంటే నేను బౌలింగ్ చేసిన లైన్ అండ్ లెంగ్త్ చాలా సార్లు పర్ఫెక్ట్‌గా లేదు. దీంతో ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగులు రాబట్టారు. కొన్నిసార్లు బంతి బ్యాట్ ఎడ్జ్‌లకు తాకి బౌండరీలు వచ్చాయి. అప్పుడప్పుడు బౌన్సర్లు వేయడానికి ప్రయత్నించా. కానీ, చివరకు పరుగులు సమర్పించుకున్నా. అయితే,






# క్రిస్టియానో రోనాల్డో సీక్రెట్ ఇదేనా?

స్పోర్ట్స్ లో ఏజ్ అనేది చాలా ముఖ్యం. ఆటల్లోకి ఎంట్రీ ఇవ్వడం దగ్గర నుంచి ఎప్పటివరకు కొనసాగాలనే విషయం దాకా అంతా వయసు మీదే ఆధారపడి ఉంటుంది. ఏజ్, ఫిట్‌నెస్ ను బట్టే ఆటగాళ్లు ఎప్పుడు రిటైర్ అవ్వాలనే నిర్ణయం కూడా తీసుకుంటారు. అయితే కొందరు ప్లేయర్లు మాత్రం వయసు పెరుగుతున్న కొద్దీ మరింత ఫిట్‌గా మారుతూ అందర్నీ ఆశ్చర్యాలకు గురిచేస్తుంటారు. అలాంటి అరుదైన అథ్లెట్లలో టాప్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో ఒకడు. 40 ఏళ్ల ఈ లెజెండరీ ప్లేయర్, 20 ఏళ్ల కుర్రాడిలా అదరగొడుతున్నాడు. మోస్ట్ ఫిటెస్ట్ అథ్లెట్‌గా అందరి చూపులు తన వైపునకు తిప్పుకుంటున్నాడు. ఫుట్‌బాల్ లాంటి కఠినమైన క్రీడల్లో ఫిట్‌గా ఉంటూ ఇన్నేళ్ల పాటు కెరీర్‌ను కొనసాగించడం అంత ఈజీ కాదు. కానీ రొనాల్డో మాత్రం ఇప్పటికీ అద్భుతమైన ఫిట్‌నెస్‌తో వరుస టోర్నీల్లో ఆడుతూ వరల్డ్ బెస్ట్ ప్లేయర్‌గా దుమ్మురేపుతున్నాడు. అతడి ఫిట్‌నెస్, హెల్త్ సీక్రెట్ ఏంటో కనుక్కునేందుకు అభిమానులు చాలా ఆసక్తి చూపిస్తుంటారు. తాజాగా ఈ విషయంపై సౌదీ అరేబియాకు చెందిన ఓ డాక్టర్ కీలక కామెంట్స్ చేశారు. బయటకు కనిపించే ఫిజికల్ ఏజ్ కంటే రొనాల్డో బయోలాజికల్ ఏజ్ ఇంకా తక్కువ అని అన్నారు. అతడు అథ్లెట్ మాత్రమే కాదు.. ఒక కేస్ స్టడీ అని చెప్పారు. రొనాల్డోను కేవలం అథ్లెట్‌గా మాత్రమే చూడొద్దు. అతడో కేస్ స్టడీ. అతడి బయోలాజికల్ ఏజ్ 20 అని చెప్పొచ్చు. 40 ఏళ్లు నిండినా అతడు రోజురోజుకీ మరింత చిన్నవాడిలా మారుతున్నాడు. వయసు పెరుగుతున్నా అతడు యవ్వనంగా కనిపిస్తున్నాడు. ఇందుకు ఫిట్‌నెస్, ఆహారపు అలవాట్లే ప్రధాన కారణం. రొనాల్డో శరీరంలో 50 శాతం మజిల్ మాస్, 7 శాతం బాడీ ఫ్యాట్ ఉన్నాయి. ఆహారం, నిద్ర, ట్రెయినింగ్.. ఇలా ప్రతిదాన్నీ శాస్త్రీయంగా ప్లాన్ చేసుకొని పాటించడం వల్లే ఇది సాధ్యమైంది అని సైంటిస్ట్ పేర్కొన్నారు.

# బుమ్రా టెస్ట్ భవిష్యత్తుపై క్లారిటీ?




రీసెంట్ గా ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సందర్భంగా జస్ప్రీత్ బుమ్రా గాయపడ్డాడు. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ లో ముంబయి ఇండియన్స్ తరఫున తిరిగి మైదానంలో అడుగుపెట్టాడు. ఇంగ్లాండ్‌తో లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌తో మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చాడు. అయితే బుమ్రా ఇంతకుముందులా పూర్తి ఫిట్‌గా అయితే లేడు అనే విషయం అర్థమవుతుంది. వర్క్‌లోడ్ కారణంగా అతడు ఇంగ్లాండ్ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ముందుగానే ప్రకటించాడు. అయితే అవి ఏఏ మ్యాచ్‌లన్నది మాత్రం తెలియజేయలేదు. లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో బుమ్రా మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. 24.4 ఓవర్లపాటు బౌలింగ్ చేసి 83 పరుగులిచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం అంతగా ప్రభావం చూపలేదు. 19 ఓవర్లు బౌలింగ్ చేసి 57 పరుగులిచ్చాడు. వికెట్లు మాత్రం తీసుకోలేకపోయాడు. ఇలా మొత్తంగా మొదటి టెస్ట్ మ్యాచ్‌లో 43.4 ఓవర్లపాటు బౌలింగ్ చేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్ని ఓవర్లు బుమ్రా వేయడం అనేది ఓ రకంగా రిస్క్ తీసుకోవడమే. అందుకే వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఆడటం లేదని సమాచారం. అధికారికంగా మాత్రం ఇప్పటి వరకు కన్ఫార్మ్ చేయలేదు. ఈ నేపథ్యంలో టీమిండియా సమీప భవిష్యత్తులో బౌలింగ్ పరంగా తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో యంగ్ బౌలర్లకు ఇదే అద్భుత అవకాశమూ కానుంది. చక్కటి ప్రతిభ చాటి, జట్టులో సుస్థిర స్థానం పొందేందుకు ఇంతకంటే చక్కటి ఛాన్స్ మరోటి ఉండదని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.

# చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ క్రేజీ రికార్డ్

జింబాబ్వేతో జరుగుతున్న ఫస్ట్ టెస్ట్ లో సౌతాఫ్రికా చెలరేగి ఆడుతోంది. ఒకదశలో 181 పరుగులకు 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది ప్రొటీస్. టోనీ డీ జోర్జీ, వియన్ ముల్డర్, డేవిడ్ బెడింగ్‌హామ్ లాంటి స్టార్ బ్యాటర్లు అంతా వెనుదిరిగారు. దీంతో జింబాబ్వే చేతుల్లో సఫారీలు పరువు పోగొట్టుకోవడం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ ఈ దశలో క్రీజులోకి అడుగుపెట్టిన చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ డెవాల్డ్ బ్రెవిస్ 41 బంతుల్లో 51 రన్స్ చేసి దుమ్మురేపాడు. సెంచరీ హీరో లువాన్ డీ ప్రిటోరియస్ 160 బంతుల్లో 153 రన్స్ తో కలసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఉన్నంత సేపు ప్రత్యర్థి బౌలర్లను ఉతికి ఆరేశాడు బ్రెవిస్. బౌండరీలు, సిక్సులతో జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు డెవాల్డ్ బ్రెవిస్. టెస్టులను టీ20లు మార్చేశాడు. ఉన్నది కాసేపే అయినా ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. 3 ఫోర్లు, 4 భారీ సిక్సులతో ప్రత్యర్థి బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్‌ను చెడగొట్టాడు. ఈ క్రమంలో 38 బంతుల్లో ఫిఫ్టీ రన్స్ మార్క్‌ను అందుకున్నాడు బ్రెవిస్. తద్వారా అరంగేట్రంలో అత్యధిక వేగంగా అర్ధ శతకం బాదిన సౌతాఫ్రికా బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. బ్రెవిస్ ఔట్ అయిన తర్వాత ప్రిటోరియస్ చెలరేగిపోయాడు. భారీ శతకంలో సౌతాఫ్రికాను తిరిగి మ్యాచ్‌లోకి తీసుకొచ్చాడు. కార్బిన్ బాష్ 124 బంతుల్లో 100 రన్స్ చేసి కూడా విధ్వంసక ఇన్నింగ్స్‌తో విరుచుకుపడటంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 418 పరుగుల భారీ స్కోరుకు చేరుకుంది ప్రొటీస్. క్వెనా మఫాకా క్రీజులో ఉన్నాడు.



# కల్కి 2 సెప్టెంబర్ లో షూటింగ్ షురూ..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కల్కి 2 ప్రారంభంపై కొన్ని రోజులుగా సస్పెన్స్ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. రేస్ నుంచి స్పిరిట్ ఎగ్జిట్ అవ్వడంతో కల్కి 2 పై బజ్ క్రియేట్ అయ్యింది. కానీ మేకర్స్ నుంచి ఎలాంటి క్లారిటీ లేకపోవడంతో.. డార్లింగ్ లైనప్ లో కొత్త డైరెక్టర్ల పేర్లు తెరపైకి రావడంతో కల్కి 2 ఇప్పట్లో మొదలవుతుందా? లేదా? అన్న సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో అన్ని డౌట్స్ కి క్లారిటీ ఇస్తూ స్టార్ ప్రొడ్యూసర్ అశ్వీనిదత్ అప్డేట్ ఇచ్చేసారు. కల్కి 2 సెప్టెంబర్ లో స్టార్ట్ అవుతుందని తెలిపారు. కల్కి గొప్ప విజయం సాధించింది. దీంతో రెండవ భాగంపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం టీమ్ ప్రీ ప్రొడక్షన్‌ను పూర్తి చేస్తోంది. సీక్వెల్ ని మరింత ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్నాం. ప్రేక్షకుల అంచనాలకు అందకుండా ఉంటుందన్నారు. అలాగే షూటింగ్ తో సహా అన్ని పనులు పూర్తి చేసి 2026 వేసవిలో రిలీజ్ చేస్తామన్నారు. దీంతో కల్కి 2పై అధికారికంగా విషయం బయటకు వచ్చింది. ప్రస్తుతం ప్రభాస్ పౌజీ, రాజాసాబ్ షూటింగ్ లతో బిజీగా ఉన్నాడు. రాజాసాబ్ షూటింగ్ జులై ఆగస్టు కల్లా పూర్తవుతుంది. పౌజీ కూడా ముగింపు దశకు చేరుకునే ఉంటుంది. ఆప్రాజెక్ట్ మొదలైన నాటి నుంచి డార్లింగ్ పౌజీ కోసమే ఎక్కువ డేట్లు కేటాయించి పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే `రాజాసాబ్` ఆలస్యమైంది. కాబట్టి `పౌజీ` కూడా సెప్టెంబర్ కి పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో `కల్కి 2`ని ఎంత మాత్రం ఆలస్యం చేయకుండా సెప్టెంబర్ నుంచి పట్టాలెక్కించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే దత్ గారు వేసవి రిలీజ్ అన్నారు. కానీ సెప్టెంబర్ లో ప్రారభించి వేసివిలో రిలీజ్ చేయడం అన్నది సాధ్యమవుతుందా? అన్నది సందేహమే. షూటింగ్ పూర్తవ్వడానికే ఏడాది సమయం పడుతుంది. అటుపై పోస్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత



# కన్నప్పపై ఆర్జీవీ హార్ట్ టచింగ్ కామెంట్స్.. వైరల్






కన్నప్ప సినిమా కోసం మంచు విష్ణు ఎంతగా హార్డ్ వర్క్ చేశారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. శివుడిపై అపారమైన భక్తితో తెరకెక్కిన ఈ సినిమా ప్రస్తుతానికి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ పొందుతున్నప్పటికీ.. విష్ణు చేసిన పాత్రపై కొందరు ప్రత్యేకంగా స్పందిస్తున్నారు. ముఖ్యంగా, ఆయన నటనపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఓ ఎమోషనల్ మెసేజ్ పంపడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వర్మ తన మనసులోని మాటలను షేర్ చేస్తూ విష్ణుకి మెసేజ్ పంపారు. నేను దేవుడిని, భక్తులనూ నమ్మని వ్యక్తిని. అలాంటి నేపథ్యంలో ఏ సినిమా అయినా భక్తి విషయాలపై వస్తే చూస్తాను అనే ఛాన్సే ఉండదు. కానీ ఈ సినిమా క్లైమాక్స్‌లో నువ్వు చేసిన నటన చూసి ఉలిక్కిపడ్డాను. నిజంగా నువ్వు నటించలేదు, ఆ పాత్రగా జీవించావు అంటూ ఆర్జీవీ మెసేజ్‌లో తెలిపారు. విష్ణు పోషించిన తిన్నడు క్యారెక్టర్ లోని ఓ క్లైమాక్స్ సన్నివేశాన్ని ప్రస్తావిస్తూ.. శివలింగం నుంచి రక్తం ఆగాలంటే తన కన్నులను సమర్పించుకునే క్షణంలో విష్ణు చూపించిన ఎమోషన్‌ను వర్మ ప్రశంసించారు. ఆ సీన్ నాకు ఇష్టం ఉండదనుకున్నాను. కానీ నువ్వు చూపించిన హృదయవిదారకమైన నటన కారణంగా నేను ప్రేమించాల్సి వచ్చింది, అని కామెంట్ చేశారు. అంతేకాదు, ఆ సన్నివేశంలో విష్ణు ముఖంలో కనిపించిన హావభావాలను స్టన్నింగ్ అంటూ అభివర్ణించారు వర్మ. నిజాయితీగా శివుడికి లొంగిన తిన్నాడు పాత్ర ద్వారా నువ్వు భావోద్వేగాలను మాస్టర్‌క్లాస్‌లా చూపించావు అని ఆయన పొగడ్తల వర్షం కురిపించారు. అందరూ థియేటర్‌కు ప్రభాస్ కోసం వచ్చేస్తారు. కానీ ఇప్పుడు నేను నిన్ను చూడటానికి టికెట్ తీసుకుంటాను అంటూ ఆర్జీవీ మెసేజ్ ముగించారు. దీనిపై స్పందించిన విష్ణు కూడా ఎమోషనల్ అయ్యాడు. రాము గారు.. మీరు ఏడిపించేశారు. చాలాకాలంగా నా కన్నీళ్లను అణిచిపెట్టుకుంటూ ఉన్నాను. ఎందుకంటే నేను దీన్ని తట్టుకోగలనని నమ్మాను. నా జీవితంలో ఇదొక అత్యంత కష్టమైన దశ. నా చుట్టూ ఉన్నవాళ్లందరూ సందేహం లేదా ద్వేషంతో ఉన్నారు, అంటూ స్పందించారు. ఇక భక్తి కథాంశాన్ని ఇష్టపడని ఆర్జీవీ వంటి దర్శకుడి నుంచి వచ్చిన ఈ స్థాయి మెసేజ్.. విష్ణు నటనపై ఎంతగానో ప్రభావం చూపిందని చెప్పవచ్చు.

# ఫైనల్ స్టేజ్‌కు చేరుకున్న ది రాజాసాబ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ సినిమా ది రాజాసాబ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తుండగా హారర్ కామెడీ సినిమాగా ఈ మూవీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుంది. ఇక ఈ సినిమా నుంచి ఇటీవల రిలీజ్ అయిన టీజర్ ఈ మూవీపై అంచనాలను అమాంతం పెంచేసింది. కాగా, ఈ సినిమాకి సంబంధించి తాజాగా ఓ అప్డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫైనల్ షెడ్యూల్ కోసం సిద్ధమవుతుందని.. ప్యాలెస్ సెట్‌లో ఈ ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ జరపనున్నారట. ఈ షెడ్యూల్‌లో సినిమా క్లైమాక్స్‌ను షూట్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఈ షెడ్యూల్‌ను జూలై ఫస్ట్ వీక్‌లో షూట్ చేయాలని వారు ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమాలో అందాల భామలు నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వ ప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



# పవర్ ప్యాక్డ్ ట్రైలర్ రెడీ.. హరిహర వీరమల్లు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ మూవీ హరిహర వీరమల్లు నుంచి లేటెస్ట్ గా ఓ బిగ్ అప్డేట్ అయితే వచ్చేసింది. ఈ సినిమా నుంచి అప్డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్న అభిమానులకు ఇది గుడ్ న్యూస్ అని చెప్పాలి. హరిహర వీరమల్లు సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ డేట్ అండ్ టైం ఫిక్స్ చేశారు. పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ లో నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను జూలై 3న ఉదయం 11.10 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మూవీ యూనిట్ అనౌన్స్ చేసింది. ఈ మేరకు ఓ సాలిడ్ పోస్టర్ తో ఈ అనౌన్స్‌మెంట్ చేశారు. యుద్ధానికి తుపాకి పట్టుకుని సిద్ధంగా ఉన్న వీరమల్లు లుక్ అదిరిపోయింది. ఈ లుక్‌లో పవర్ స్టార్‌ని చూసి అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక ఈ ట్రైలర్ ఎలాంటి కొత్త రికార్డులు క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. ఈ సినిమాకి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందించగా క్రిష్, జ్యోతికృష్ణ డైరెక్ట్ చేశారు. ఏ.ఎం.రత్నం ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమాని జూలై 24న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.






# పెద్దికి, ది ప్యారడైజ్ కి క్లాష్ కానుందా?

తెలుగు సినిమా దగ్గర ఒకే డేట్ లో రెండు సినిమాలు రావడం అనేది ఎప్పుడూ కొత్త కాదు. అయితే ఒకే డేట్ లో ఎలాంటి సినిమాలు వస్తున్నాయి అనేది ముఖ్యం. ఇలా వచ్చే ఏడాది భారీ క్లాష్ కి ఆల్రెడీ కొన్ని సినిమాలు సిద్ధంగా ఉన్నాయి. అయితే వాటిలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా పెద్ది అలాగే నాచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలు ఉన్నాయి. ఒక్కరోజు తేడాతో రెండు సినిమాలు క్లాష్ అవ్వనుండగా ఆ మధ్య ది ప్యారడైజ్ మాత్రం వాయిదా పడుతుంది అని పెద్ది సినిమా సోలో రిలీజ్ గా వస్తుంది అని టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు ట్విస్ట్ ఏమిటంటే ఈ రెండు సినిమాల నడుమ క్లాష్ ఆగిపోలేదు. నాని లేటెస్ట్ గానే సినిమా సెట్స్ లోకి అడుగు పెట్టినట్టు ఒక మాసివ్ స్టిల్ తో మేకర్స్ సాలిడ్ అప్డేట్ ఇవ్వడమే కాకుండా 2026 మార్చ్ 26నే సినిమా వస్తుంది అంటూ కన్ఫర్మ్ చేశారు. దీనితో ఈ రెండు సినిమాల క్లాష్ ఇంకా ఆన్ లోనే ఉందని చెప్పాలి. ఇక పెద్ది సినిమాని బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తుండగా వృద్ధి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ది ప్యారడైజ్ ని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండగా ఎస్ ఎల్ వి సినిమాస్ వారు భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తున్నారు. ఇక ఈ రెండు సినిమాలపై అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

